# క్రైమ్ మిర్రర్®

Voice of Anti Corruption

హైదరాబాద్
25-7-2026
వెల: రూ.5/-
పేజీలు: 10+10
సంపుటి:16
సంచిక: 123

PUBLISHED FROM HYDERABAD CIRCULATED BY RANGAREDDY, NALGONDA, KHAMMAM, KARIMNAGAR, WARANGAL, MAHABOOBNAGAR, MEDAK, NIZAMABAD, ADILABAD




## కొత్తగూడెంపై పొంగులేటి కన్ను!

సిపిఐ ఎమ్మెల్యే కూనంనేనికి చెక్ పెట్టే ప్రయత్నం

అవినీతి, అసమర్థ ముద్ర వేసి సైడ్ చేసే వ్యూహం

ఖమ్మంలో ముదురుతున్న రాజకీయ వివాదం

**క్రైమ్ మిర్రర్, తెలంగాణ బ్యూరో:** కొత్తగూడెం సీటుపై మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి కన్నేశారా? వచ్చే ఎన్నికల్లో అక్కడి నుంచి పోటీకి సిద్ధపడుతున్నారా? సిపిఐ రాష్ట్ర అధ్యక్షుడు కూనమనేనికి చెక్ పెడుతున్నారా? సిపిఐ తో పొత్తు లేకుండా చేయాలనుకుంటున్నారా? దీనిపై కాంగ్రెస్ హై కమాండ్ సీరియస్ గా ఉందా? అంటే అవుననే సమాధానం వినిపిస్తోంది.

## క్రెడిట్ వార్!



2లో

ఉద్యోగాల భర్తీ విషయంలో కాంగ్రెస్ వర్సెస్ బీఆర్ఎస్

నోటిఫికేషన్లు గులాబీ పార్టీ హయాంలో.. నియామక పత్రాలు హస్తం చేతిలో..

మైలేజ్ కోసం రెండు పార్టీల ఆరాటం

తెలంగాణలో ఇప్పుడు ఉద్యోగాల క్రెడిట్ వార్ నడుస్తోంది. అధికార కాంగ్రెస్ వర్సెస్ విపక్ష బీఆర్ఎస్ అన్నట్లు పరిస్థితి మారింది. తాము అధికారంలోకి వచ్చిన కొద్ది కాలంలోనే ఏకంగా 70 వేల ఉద్యోగాలు భర్తీ చేసామని కాంగ్రెస్ ప్రభుత్వం చెబుతోంది. నిరుద్యోగుల ఆకాంక్షలకు అనుగుణంగా కాంగ్రెస్ ప్రభుత్వం నడుచుకుంటూ ఉందని ప్రచారం చేస్తోంది. కానీ బీఆర్ఎస్ దీనిని అంగీకరించడం లేదు. ఆ ప్రచారాన్ని ఖండిస్తోంది.

క్రైమ్ మిర్రర్, తెలంగాణ బ్యూరో



## ఆర్టీసీ ఉద్యోగుల కల సాకారం

త్వరలో ప్రభుత్వంలో ఆర్టీసీ విలీనం

డిసెంబరు 9న సర్కారు ప్రకటన చేసే అవకాశం

ముందుగా ఆర్టీసీ గుర్తింపు సంఘం ఎన్నికలు

విలీన ప్రక్రియలో గుర్తింపు సంఘానికి భాగస్వామ్యం

కార్మికుల సమ్మె డిమాండ్ల అమలుకు కార్యాచరణ

ఇప్పటికే అమలవుతున్న పలు డిమాండ్లు

క్రైమ్ మిర్రర్, తెలంగాణ బ్యూరో

తెలంగాణ ఆర్టీసీ ఉద్యోగుల చిరకాల కోరిక త్వరలో నెరవేరే అవకాశాలు కనిపిస్తున్నాయి. ప్రభుత్వంలో ఆర్టీసీ విలీనంపై వారు ఎంతో కాలంగా ఎదురుచూస్తున్న సమయం అతిత్వరలోనే రానుంది. ఆర్టీసీ ఉద్యోగులను ప్రభుత్వంలో విలీనం చేసే ప్రక్రియపై రాష్ట్ర ప్రభుత్వం కసరత్తు ప్రారంభించినట్లు తెలుస్తోంది.

- మిగతా 2వ పేజీలో

## తుంగతుర్తి ప్రజలు నన్ను క్షమించాలి

నా మాటమీద మీరంతా సామేల్‌ను గెలిపించారు

సామేల్‌ను తానెప్పుడూ అగౌరవపర్చలేదు

మీడియాతో ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి



భువనగిరి,జులై 24(ఆర్ఎన్ఎ): తనకు ఎవరితోనూ వ్యక్తిగత విభేదాలు లేవని మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి స్పష్టం చేశారు. శుక్రవారం భువనగిరిలో తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేల్ వ్యాఖ్యలపై ఆయన

3లో

## కాక్రోచ్‌ల దెబ్బకు కేంద్రం ఉక్కిరి బిక్కిరి

ఢిల్లీలో విద్యార్థుల ఆందోళనలతో ఆగమాగం

తొలుత ఏమాత్రం పట్టించుకోని మోదీ సర్కారు

నీట్ సహా జాతీయ స్థాయి పోటీ పరీక్షల్లో అక్రమాలకు బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలంటూ కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) ఢిల్లీలో చేపట్టిన ఆందోళన కేంద్రంలోని మోదీ సర్కారును వణికిస్తోంది. నెల రోజులుగా జంతర్ మంతర్ వద్ద ఆందోళనలు చేస్తున్న కాక్రోచ్ లను కానీ, నిరాహారదీక్షకు దిగిన సామాజిక కార్యకర్త సోనమ్ వాంగ్ చుక్ ను కానీ మొదట్లో పట్టించుకోని కేంద్రం.. ఆ తర్వాత పరిస్థితి చేజారుతుండటంతో వారితో చర్చలు ప్రారంభించింది. వారి డిమాండ్లను కూడా నెరవేర్చేందుకు సిద్ధపడింది.





దేశ వ్యాప్త ఉద్యమంగా మారడంతో దిగొచ్చిన వైనం

పేపర్ లీకేజీకీలపై పార్లమెంటులో కఠిన చట్టం

లీకేజీకి పాల్పడితే 10 ఏళ్ల జైలు.. 10 కోట్ల ఫైన్

ప్రస్తుత చట్టంలో సవరణలకు నిర్ణయం

ముసాయిదా బిల్లుకు కేంద్ర క్యాబినెట్ ఆమోదం!

క్రైమ్ మిర్రర్, తెలంగాణ బ్యూరో

పేపర్ లీకేజీలను అరికట్టేందుకు ప్రస్తుతం అమల్లో ఉన్న 'పబ్లిక్ పరీక్షల (అక్రమ పద్ధతుల నివారణ) చట్టం–2024'ను సవరించాలని నిర్ణయించింది. ప్రశ్నపత్రాల లీక్ కేసుల్లో దోషులకు పదేళ్ల వరకు జైలు శిక్ష, రూ.10 కోట్ల వరకు జరిమానా విధించేలా ముసాయిదా బిల్లును రూపొందించినట్లు తెలుస్తోంది

నీట్ ప్రశ్నపత్రం లీకేజీ నేపథ్యంలో కాక్రోచ్ జనతా పార్టీ జంతర్ మంతర్ వద్ద చేపట్టిన ఆందోళన..

- మిగతా 2వ పేజీలో



## వైసీపీలోకి బిఆర్ఎస్ అధ్యక్షుడు?

పొలిటికల్ రీ ఎంట్రీకి తోట చంద్రశేఖర్ సిద్ధం

మొన్నటి ఎన్నికలకు ముందు ఏపీ బాధ్యతలు

**క్రైమ్ మిర్రర్, ఏపీ బ్యూరో:** ఏపీలో రాజకీయాలు ఆసక్తికరంగా మారుతున్నాయి. చాలామంది నేతలు తమ రాజకీయ భవిష్యత్తు వెతుక్కుంటూ వివిధ పార్టీల్లో చేరేందుకు రంగం సిద్ధం చేసుకుంటున్నారు.

- మిగతా 2వ పేజీలో

## ఆర్మీకి హైడ్రా సాయం!

రక్షణ శాఖ భూములను కాపాడాలని వినతి

ఆర్మీతో జైల్లో పెట్టిస్తానని కోర్టు హెచ్చరికల నేపథ్యంలో కీలక పరిణామం





2లో



## డ్రగ్స్‌పై ఉక్కుపాదం మోపేందుకు కఠిన నిబంధనలు

ఉన్నతాధికారులకు సిఎం రేవంత్ అదేశాలు

హైదరాబాద్,జులై 24: డ్రగ్స్‌పై ఉక్కుపాదం మోపేందుకు కఠిన నిబంధనలు తీసుకురావాలని ఉన్నతాధికారులను తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశించారు. డ్రగ్స్ నిరోధంపై


## విజయసాయిరెడ్డి పొలిటికల్ సైలెన్స్!

జూలైలో రాజకీయ ప్రకటన చేస్తానని వెల్లడి

బిజెపిలో చేరేందుకు ప్రయత్నం

వైసీపీలోకి నో ఎంట్రీ

అందుకే మౌనం పాటిస్తున్న మాజీ ఎంపీ



**క్రైమ్ మిర్రర్, ఏపీ బ్యూరో:** విజయసాయిరెడ్డి ఏ పార్టీలో చేరుతారు? బిజెపిలో చేరుతారా? లేకుంటే వైసీపీలోకి రీఎంట్రీ ఇస్తారా? కొత్త పార్టీని పెడతారా? పొలిటికల్ సర్కిల్స్ లో

3లో




## గ్రేటర్‌పై బిజెపి గురి!

మూడు కార్పొరేషన్ లే టార్గెట్

వరంగల్లో క్లీన్ స్వీప్ చేయాలని వ్యూహం

అసెంబ్లీ, సార్వత్రిక ఎన్నికలే అసలు లక్ష్యం

క్రైమ్ మిర్రర్, తెలంగాణ బ్యూరో: భారతీయ జనతా పార్టీ పక్క వ్యూహంతో ముందుకు సాగుతోంది. వచ్చే ఎన్నికల్లో తెలంగాణలో అధికారంలోకి వచ్చేందుకు





# డ్రగ్స్‌పై ఉక్కుపాదం మోపేందుకు కఠిన నిబంధనలు

ప్రభుత్వం సీరియస్‌గా దృష్టి సారించింది. ఈ నేపథ్యంలో శుక్రవారం హైదరాబాద్‌లో రాష్ట్రంలో మాదక ద్రవ్యాల నిరోధం, భద్రత కమిటీలపై ఆయన సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులకు సీఎం రేవంత్ రెడ్డి పలు కీలక సూచనలు చేశారు. విద్యా సంస్థల్లో డ్రగ్స్ నియంత్రణకు సంబంధించి ఆయా సంస్థల యాజమాన్యాలను బాధ్యులను చేయాలని స్పష్టం చేశారు. క్యాంపస్ లోపల డ్రగ్స్‌కు సంబంధించి ఏ ఘటనకైనా యాజమాన్యాన్నే బాధ్యులను చేయాలని సూచించారు. డ్రగ్స్ విషయంలో క్యాంపస్ బయట జరిగే యాక్టివిటీని గుర్తించి సమాచారాన్ని అందించే వ్యవస్థను ఏర్పాటు చేసే అంశాన్ని పరిశీలించాలని అధికారులను ఆదేశించారు. ఌద్యాసంస్థలకు అధికారంతో పాటు బాధ్యతను అప్పగించాలని తెలంగాణ సీఎం పేర్కొన్నారు. విద్యార్థుల ప్రవర్తనలో మార్పులను గుర్తించేందుకు యాజమాన్యాలు ప్రత్యేక విభాగాన్ని ఏర్పాటు చేసుకునేలా చూడాలని అన్నారు. డ్రగ్స్‌కు సంబంధించిన సమాచారం అందించేందుకు విద్యాసంస్థల ఆవరణలో టోల్ ఫ్రీ నెంబర్, ప్రత్యేక క్యూఆర్ కోడ్ ఏర్పాటు చేసే అంశాన్ని పరిశీలించాలని ఉన్నతాధికారులకు స్పష్టం చేశారు. గుర్తించడం, మాన్పించడం, శిక్షించడం.. ఈ మూడు దశలను సమర్థవంతంగా నిర్వహించేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని సీఎం తెలిపారు. డ్రగ్స్ స్వీకరించి పట్టుబడితే డీ-అడిక్షన్ సెంటర్‌కు తరలించాలని అన్నారు. తరచూ పట్టుబడితే కఠినంగా శిక్షించే అంశాన్ని కూడా పరిశీలించాలని సూచించారు.

# కాక్రోచ్‌ల దెబ్బకు కేంద్రం ఉక్కిరి బిక్కిరి

(మొదటి పేజీ తరువాయి)

ఒక్క నీటి బిందువుతో మొదలై మహా సముద్రంగా మారిన చందంగా ఉధృతమైన విషయం తెలిసిందే. అయితే కేంద్ర ప్రభుత్వం తొలుత దీనిని కనీసం పరిగణనలోకి కూడా తీసుకోలేదు. కానీ, రోజురోజుకూ వారికి మద్దతు పెరుగుతుండడం, దేశ వ్యాప్త ఉద్యమంగా మారడంతో దిగివచ్చింది. అయితే వారితో చర్చలు జరుపుతామని చెబుతూనే.. వారి డిమాండ్లను అంగీకరించకుండా కాలయాపన చేస్తూ ఆంక్షలు, దాడులతో ఒత్తిడి పెంచింది. అయినా వెనక్కి తగ్గని విద్యార్థులు తమ ఆందోళనను కొనసాగిస్తూ వచ్చారు. దీంతో అనివార్య పరిస్థితుల్లో ప్రధాని మోదీ గురువారం రాత్రి పరీక్షల విషయంలో కఠినమైన కొత్త చట్టం రాబోతోందని హామీ ఇస్తూ వీడియో సందేశాన్ని విడుదల చేశారు. మరోవైపు విద్యార్థులపై దాడులకు దిగిన పోలీసులపై ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవడం ప్రారంభించారు. సోషల్ మీడియాలో వైరల్ అవుతున్న వీడియాల్లో ఉన్న పోలీసులపై వరుసగా సస్పెన్షన్లు,



బదిలీలు, ఇతర బాధ్యతల అప్పగింతలు జరుగుతున్నాయి.

**డిమాండ్లను నెరవేర్చే దిశగా..**

విద్యార్థుల డిమాండ్లను నెరవేర్చ దిశగా కేంద్ర ప్రభుత్వం ముందుకొచ్చిది. పరీక్ష ప్రశ్నపత్రాల లీకేజీకి పాల్పడే వారిని కఠినంగా శిక్షించేందుకు సన్నద్ధమైంది. ఇందుకు సంబంధించి ప్రస్తుతం అమల్లో ఉన్న 'పబ్లిక్ పరీక్షల (అక్రమ పద్ధతుల నివారణ) చట్టం-2024'ను సవరించాలని నిర్ణయించింది. ఈ మేరకు శుక్రవారం ప్రధాని మోదీ అధ్యక్షతన జరిగిన క్యాబినెట్ సమావేశంలో ఆమోదం తెలిపినట్లు సంబంధిత వర్గాలు తెలిపాయి. ముఖ్యంగా ప్రశ్నపత్రాల లీక్ కేసుల్లో దోషులకు పదేళ్ల వరకు జైలు శిక్ష, రూ.10 కోట్ల వరకు జరిమానా విధించేలా ముసాయిదా బిల్లును రూపొందించినట్లు తెలుస్తోంది. ఈ బిల్లును క్యాబినెట్ ఆమోదించినట్లు సంబంధిత వర్గాలు పేర్కొన్నాయి. ప్రస్తుత చట్టం ప్రకారం.. ప్రశ్నపత్రాల లీకేజీకి పాల్పడిన వ్యక్తిగత కేసుల్లో దోషులకు 3 నుంచి 5 ఏళ్ల జైలు శిక్ష, రూ.10 లక్షల వరకు జరిమానాను విధిస్తున్నారు. అదే వ్యవస్థీకృత నేరాల్లో అయితే 5-10 ఏళ్ల జైలు శిక్ష, రూ.కోటి వరకు జరిమానా ఉంది. ఈ శిక్షలు, జరిమానాలను భారీగా పెంచుతూ చట్టాన్ని సవరిస్తున్నారు. సోమవారమే ఈ బిల్లును లోక్‌సభలో ప్రవేశపెట్టే అవకాశం ఉంది.

# క్రెడిట్ వార్!

కాంగ్రెస్ ప్రభుత్వం ఇస్తున్న నియామక పత్రాలన్నీ గత ప్రభుత్వ హయాంలో నోటిఫికేషన్లు ఇచ్చి.. పరీక్షలు నిర్వహించిన వేనని చెబుతోంది. అదంతా తమ కష్టమని.. క్రెడిట్ మాత్రం కాంగ్రెస్ దక్కించుకుంటోందని గులాబీ పార్టీ ఆరోపిస్తోంది.

**గులాబీ పార్టీకి అదే మైనస్..**

తెలంగాణలో ఎవరి హయాంలో ఉద్యోగాలు భర్తీ అన్నది చర్చకు వస్తే గులాబీ పార్టీకి ఒక మైనస్ కనిపిస్తోంది. పదేళ్లపాటు సుదీర్ఘంగా అధికారంలో ఉంది ఆ పార్టీ. ఎన్నికలకు ముందు అత్యంత కీలకమైన నియామక ప్రక్రియలను పూర్తి చేయలేకపోవడం ఆ పార్టీ చేసిన అతి పెద్ద పొరపాటు. కోర్టు కేసులు, సాంకేతిక ఇబ్బందులు ఉన్న మాట నిజమే. సుదీర్ఘ కాలం పాటు నోటిఫికేషన్. ఒకవేళ ఆ నియామకాలను తమ హయాంలో పూర్తి చేసి ఉంటే.. మొన్నటి ఎన్నికల్లో యువత పాజిటివ్గా స్పందించి ఉండేవారు. ఉద్యోగాల భర్తీ ఆలస్యం చేయడం వల్ల తెలంగాణలో గులాబీ పార్టీ తీవ్రంగా నష్టపోయింది.

**దశాబ్ద కాలం ఎదురుచూపు..**

అయితే కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో నియామక పత్రాలు అందుకున్నారు నిరుద్యోగ అభ్యర్థులు. తెలంగాణలో దశాబ్ద కాలం పాటు ఉద్యోగాల కోసం ఎదురుచూసినవారు కాంగ్రెస్ హయాంలోనే నియామక పత్రాలను అందుకోవడం విశేషం. గ్రూప్ 4, గురుకుల, పోలీస్ రిక్రూట్మెంట్లతో పాటు దాదాపు 11,000 పోస్టులతో కూడిన డీఎస్సీ ఫలితాలను సైతం కాంగ్రెస్ సర్కారు వేగంగా విడుదల చేసింది. నియామక పత్రాలను పంపిణీ చేసింది. ఆ పార్టీకి దక్కిన పెద్ద ప్లస్ పాయింట్ అదే. రాజకీయాల్లో టైమింగ్ అనేది ముఖ్యం. తాము అధికారంలో ఉన్నప్పుడు పనులు పూర్తి చేయకుండా.. పాము పెట్టిన నోటిఫికేషన్ వల్లే ఉద్యోగాలు వచ్చాయని భారత రాష్ట్ర సమితి చెబుతోంది. కానీ క్షేత్రస్థాయిలో మాత్రం యువతకు ఇది మింగుడు పడడం లేదు. భారత రాష్ట్ర సమితి నిర్లక్ష్యమే హైలెట్ అవుతోంది. అందుకే యువ సంగ్రామ సభ పేరుతో బీఆర్ఎస్ హడావిడి చేస్తోంది.

# కొత్తగూడెంపై పొంగులేటి కన్ను!



జరుగుతున్న పరిణామాలు కూడా అలానే ఉన్నాయి. అయితే గత అసెంబ్లీ ఎన్నికల్లో సిపిఐ తో పాటు బరిలో దిగింది కాంగ్రెస్. మున్సిపల్ ఎన్నికలు వచ్చేసరికి సీన్ మారింది. అందుకు కారణం పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అని పెద్ద ఎత్తున ప్రచారంలో ఉంది. సిపిఐ తో పొత్తు ఉంటే కొత్తగూడెం సీటు ఆ పార్టీకి వెళ్లిపోతుందని భావించి.. పొత్తుకు విఘాతం కలిగించే ప్రయత్నంలో ఉన్నారు అట పొంగులేటి. అయితే తన వ్యక్తిగత ప్రయోజనాల కోసం పార్టీకి డ్యామేజ్ చేస్తున్నారని హై కమాండ్ ఆగ్రహంగా ఉన్నట్లు తెలుస్తోంది.

**పొత్తులో భాగంగా సిపిఐ కి..**

గత ఎన్నికల్లో కొత్తగూడెం నుంచి పోటీకి సిద్ధపడ్డారు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి. కానీ ఖమ్మం జిల్లాలో సిపిఐ కు బలం ఉంది. అందుకే కాంగ్రెస్ పార్టీ సిపిఐ తో పొత్తు పెట్టుకుంది. కొత్తగూడెం సీటును పొత్తులో భాగంగా సిపిఐ కోరుకోవడం తో పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి పోటీ చేయలేకపోయారు. పాలేరు నుంచి పోటీ చేసి ఎమ్మెల్యేగా గెలిచారు. తరువాత మంత్రి అయ్యారు. అయితే మంత్రిగా బాధ్యతలు చేపట్టిన ఆయన కొత్తగూడెం పై మాత్రం మనసు వదులుకోలేదు. కొత్తగూడెంలో మంత్రిగా పర్యటనలు చేస్తూ.. మళ్లీ రాజకీయాలు కొనసాగిస్తూనే ఉన్నారు. అయితే స్థానిక ఎమ్మెల్యేగా ఉన్న సిపిఐ రాష్ట్ర అధ్యక్షుడు కూనంనేని సాంబశివరావుకు మాత్రం ఇది ఎంత మాత్రం మింగుడు పడడం లేదు.

**కూటమి ఘనవిజయం..**

గత అసెంబ్లీ ఎన్నికల్లో సిపిఐ తో పొత్తు పెట్టుకుంది కాంగ్రెస్ పార్టీ. ఆ రెండు పార్టీల కూటమి ఘనవిజయం సాధించింది. ఒక్క భద్రాచలం మినహాయించి మిగతా 9 అసెంబ్లీ నియోజకవర్గం కైవసం చేసుకుంది. మొత్తం పది అసెంబ్లీ సీట్లు ఉండగా.. మూడు మాత్రమే జనరల్ సీట్లు ఉన్నాయి. అందులో ఖమ్మం నుంచి తుమ్మల నాగేశ్వరరావు, పాలేరు నుంచి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, కొత్తగూడెం నుంచి సాంబశివరావు ప్రాతినిధ్యం వహిస్తున్నారు.

**తప్పిన వ్యూహం..**

మున్సిపల్ ఎన్నికల్లో ఫ్రెండ్లీ కాంటెస్ట్ అంటూ పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి సరి కొత్త రాజకీయానికి తెర తీశారు. అయితే హై కమాండ్ కు పెద్ద ఎత్తున ఫిర్యాదులు వెళ్లడంతో.. పొంగులేటి శ్రీనివాస్ రెడ్డిని కంట్రోల్ చేసింది పార్టీ. అప్పటినుంచి కొన్నాళ్లపాటు సైలెంట్ గా ఉన్నారు. కానీ ఇప్పుడు కొత్తగూడెం పై మళ్లీ దృష్టి పెట్టారు. అందులో భాగంగానే తన వియ్యంకుడు, ఖమ్మం ఎంపీ రామసహాయం రఘురాం రెడ్డితో పార్టీ వ్యవహారాల ఇంచార్జ్ మీనాక్షి నటరాజన్ కు కూనం నేనికి వ్యతిరేకంగా ఫిర్యాదు చేయించినట్లు ప్రచారం నడుస్తోంది. మరోవైపు తరచూ కొత్తగూడెంలో పర్యటనలు చేస్తూ హడావిడి చేస్తున్నారు. ముఖ్యంగా కూనంనేని పై అవినీతి, అసమర్థ ముద్రవేసి ఆ సీటు సీపీఐ నుంచి తప్పించాలని పొంగులేటి భావిస్తున్నట్లు తెలంగాణ పొలిటికల్ సర్కిల్లో ప్రచారం సాగు తోంది. దీనిపై సిపిఐ నేత కూనంనేని తీవ్ర ఆగ్రహంతో ఉన్నట్లు తెలుస్తోంది. మొత్తానికి అయితే కొత్తగూడెం వివాదం ఇప్పుడు సరికొత్త హాట్ టాపిక్ అవుతుంది తెలంగాణ పొలిటికల్ సర్కిల్స్ లో..

# ఆర్మీకి హైడ్రా సాయం!

(మొదటి పేజీ తరువాయి)

**క్రైమ్ మిర్రర్, హైదరాబాద్:** తెలంగాణలో కీలక పరిణామం. హైడ్రా వ్యవహారంలో హైకోర్టు ఆగ్రహం గా ఉంది. ఇటువంటి సమయంలో కీలక పరిణామం చోటు చేసుకుంది. ఒకవైపు హైకోర్టులో హెచ్చరికలు, ఇంకోవైపు రక్షణ శాఖ అధికారులు నేరుగా హైడ్రా కమిషనర్ రంగనాథ్ ను కలిసి వినతి పత్రం అందించడం విశేషం. మల్కాజ్గిరి లోతుకుంట లోని వివాదాస్పద భూముల విషయంలో.. ఇటీవల విచారణ చేపట్టింది తెలంగాణ హైకోర్టు. హైడ్రా కమిషనర్ రంగనాథ్ తీరుపై తీవ్ర స్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేసింది. కోర్టు ఆదేశాలను ఉల్లంఘించి.. ప్రైవేటు ఆస్తుల జోలికి వెళ్తున్నారంటూ మండిపడిన న్యాయమూర్తి.. కోర్టుదికారం పై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఒకవేళ వివాదాస్పద స్థలాల్లోకి వెళ్లి.. ఇబ్బంది పెడితే ఆర్మీ తోనే జైల్లో పెట్టిస్తామంటూ హెచ్చరించారు. ఇప్పుడు అదే ఆర్మీ.. ఇప్పుడు అదే ఆర్మీ హైడ్రా సాయాన్ని కోరడం హాట్ టాపిక్ అవుతోంది.

**దూకుడు పెంచిన హైడ్రా..**

ఇటీవల హైడ్రా దూకుడు పెంచింది. వారాంతంలో ప్రభుత్వ ఆస్తుల పరిరక్షణకు నడుంబిగించింది. అయితే దశాబ్దాలుగా తమ స్వాధీనంలో ఉన్న ఆస్తుల విషయంలో ప్రైవేటు వ్యక్తుల నుంచి అభ్యంతరాలు వ్యక్తం అవుతున్నాయి. కానీ వేలకోట్ల రూపాయల విలువైన ఆస్తులను స్వాధీనం చేసుకుంటుంది హైడ్రా. మొన్న ఆ మధ్యన కొంత విరామం ప్రకటించింది. కానీ ఇటీవల దూకుడు పెంచింది. ఈ క్రమంలో హైడ్రాకు వ్యతిరేకంగా పెద్ద ఎత్తున పిటిషన్లు దాఖలవుతున్నాయి హైకోర్టులో. అయితే విచారణ సమయంలో అవి ప్రభుత్వ భూములుగా చూపడంలో కొంతవరకు జాప్యం జరుగుతోంది. మరోవైపు తమ స్వాధీనంలో ఉన్న భూములను ప్రభుత్వం హైదరాబాద్ తీసుకోవడాన్ని బాధితులు మానవతా దృక్పథంతో కొన్ని ఆధారాలను కోర్టుకు సమర్పిస్తున్నారు. ఈ క్రమంలోనే కోర్టు హైడ్రా విషయంలో చేస్తున్న వ్యాఖ్యలు సంచలనంగా మారుతున్నాయి. ఆదేశాలు సైతం పాటించకుండా హైడ్రా దూకుడుగా ముందుకు సాగుతూ ఉండడాన్ని న్యాయస్థానాలు తప్పుపడుతున్నాయి.

**హెచ్చరించిన కొద్ది వ్యవధిలోనే..**

తెలంగాణ హైకోర్టులో ఆర్మీ ద్వారా చర్యలు తీసుకుంటామని న్యాయమూర్తి హెచ్చరించిన.. కొద్ది వ్యవధిలోనే.. అదే ఆర్మీకి చెందిన ఉన్నతాధికారులు హైడ్రా కమిషనర్ రంగనాథ్ ను కలవడం ప్రాధాన్యత సంతరించుకుంది. మేడ్చల్- మల్కాజ్గిరి జిల్లా కుత్బుల్లాపూర్ మండలంలోని జిఎల్ఆర్ సర్వేనెంబర్ 507 లో ఉన్న ఆర్మీ ఏవన్ భూమిని కొందరు ఆక్రమించి.. ఎలాంటి అనుమతులు లేకుండా జి ప్లస్ 2 భవనాన్ని నిర్మిస్తున్నారని లెఫ్టినెంట్ కల్నల్ జై సింగ్, హైడ్రా ఏసిపి ఉమామహేశ్వరరావు సమక్షంలో కమిషనర్ కు ఫిర్యాదు చేశారు. ఆక్రమణలను అడ్డుకొని.. రక్షణ శాఖ భూములను కాపాడాలని కోరారు. అందుకే ఇప్పుడు హైడ్రా క్షేత్రస్థాయిలో చర్యలు చేపట్టేందుకు రంగంలోకి దిగింది. ప్రభుత్వ భూముల పరిరక్షణ కోసం హైడ్రాను ఏర్పాటు చేశారు. ఈ క్రమంలో ఈ వ్యవస్థ పై కొంత ప్రతికూలత వచ్చింది. కానీ ఇప్పుడు దేశ రక్షణ శాఖ సైతం తమ ఆస్తుల పరిరక్షణకు హైడ్రాను సంప్రదించడం మాత్రం.. తెలంగాణలో ఆ వ్యవస్థ పై ఏ స్థాయిలో నమ్మకం ఏర్పడిందో అర్థం అవుతోంది.

# ఆర్టీసీ ఉద్యోగుల కల సాకారం

ఈ ఏడాది డిసెంబరు 9న విలీనానికి సంబంధించిన ప్రకటన చేసే అవకాశం ఉన్నట్లు ప్రచారం జరుగుతోంది. ఈ ప్రక్రియలో భాగంగా ముందుగా గుర్తింపు కార్మిక సంఘం ఎన్నికలు నిర్వహించి, అనంతరం విలీన ప్రక్రియను పూర్తి చేయాలనే ఆలోచనలో సర్కారు ఉన్నట్లు సమాచారం. ఈ ఏడాది ఏప్రిల్‌లో ఆర్టీసీ ఉద్యోగ సంఘాలు చేపట్టిన సమ్మె సందర్భంగా 32 డిమాండ్లను ప్రభుత్వం ముందుంచాయి. వీటిలో ప్రభుత్వంలో విలీనం ప్రధాన అంశం. దీంతోపాటు ప్రభుత్వ ఉద్యోగులతో సమానంగా జీతభత్యాలు కల్పించాలని, గుర్తింపు కార్మిక సంఘం ఎన్నికలు నిర్వహించాలని కూడా కోరాయి. వీటిలో ఎక్కువశాతం డిమాండ్లను ప్రభుత్వం ఇప్పటికే అమలు చేస్తోంది. ఇప్పుడు ఎన్నికలు పూర్తి చేసి, విలీన ప్రక్రియను తుది దశకు తీసుకెళ్లడంపైనే దృష్టి పెట్టినట్లు తెలుస్తోంది. ఎన్నికలు పూర్తయిన తర్వాత విలీనానికి సంబంధించిన విధివిధానాలను ఖరారు చేసి, డిసెంబరు 9న ఆర్టీసీ ఉద్యోగుల ప్రభుత్వ విలీనంపై కీలక ప్రకటన చేసే అవకాశం ఉందని అధికార వర్గాలు పేర్కొంటున్నాయి. ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేయాలని గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలోనే నిర్ణయించిన విషయం తెలిసిందే. ఇందుకు సంబంధించిన బిల్లు అసెంబ్లీ ఆమోదం కూడా పొందింది. అయితే నాటి గవర్నర్ తమిళిసై సౌందర్ రాజన్ ఆ బిల్లుపై సంతకం చేయకపోవడంతో పెండింగ్ లో పడింది. గవర్నర్ తమిళిసైతో నాటి ముఖ్యమంత్రి కేసీఆర్, ఆయన ప్రభుత్వం ఘర్షణాత్మక వైఖరితో వ్యవహరించడం వల్లే ఆమె ఆ బిల్లును పెండింగ్ లో పెట్టారు. అనంతరం ఎన్నికలు వచ్చి.. బీఆర్ఎస్ అధికారం కోల్పోవడం, కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటు కావడంతో ఇన్నాళ్లుగా ఇది పెండింగ్ లోనే ఉండిపోయింది.

**నోడల్ అధికారి నియామకంతో..**

కాంగ్రెస్ ప్రభుత్వంతో ఆర్టీసీ కార్మికులు సఖ్యతగా వ్యవహరిస్తూ వారి డిమాండ్లను సాధించుకునే ప్రయత్నం చేశారు. అయితే ప్రధాన డిమాండ్ అయిన సంస్థ విలీనం మాత్రం అలాగే ఉండిపోయింది. దీంతో ఈ ఏడాది ఏప్రిల్ లో వారు మళ్లీ సమ్మెకు దిగారు. ఆ సందర్భంగా ప్రభుత్వం వారికి పలు హామీలు ఇచ్చింది. వాటిలో కొన్నింటిని ఇప్పటికే అమలు చేసింది. ఉద్యోగులు కోరిన డిమాండ్లలో విలీన ప్రక్రియ, గుర్తింపు కార్మిక సంఘం ఎన్నికలు ప్రధానమైనవి. ఈ నేపథ్యంలో ఎన్నికల నిర్వహణ కోసం తెలంగాణ ప్రభుత్వం లేబర్ జాయింట్ కమిషనర్ సునీతను నోడల్ అధికారిగా నియమించింది ప్రభుత్వం. దీంతో ఎన్నికల ప్రక్రియకు అధికారికంగా శ్రీకారం చుట్టినట్లయిందని అధికారులు పేర్కొంటున్నారు. కేసీఆర్ హయాంలో గుర్తింపు సంఘమే వద్దంటూ రద్దు చేసిన విషయం తెలిసిందే. ఆనాడు కార్మిక సంఘాలతో ప్రభుత్వానికి వైరం నెలకొనడంతో ఆయన ఆ నిర్ణయం తీసుకున్నారు.

# వైసీపీలోకి బిఆర్ఎస్ అధ్యక్షుడు?

(మొదటి పేజీ తరువాయి)

ఈ నేపథ్యంలో బిఆర్ఎస్ ఏపీ అధ్యక్షుడు తోట చంద్రశేఖర్ తన రాజకీయ భవిష్యత్తు కోసం వ్యూహరచన సిద్ధం చేస్తున్నారు. ఏదో ఒక పార్టీలో చేరేందుకు ఆయన గట్టి ప్రయత్నం లోనే ఉన్నారు. ముఖ్యంగా వైయస్సార్ కాంగ్రెస్ పార్టీలో కానీ.. భారతీయ జనతా పార్టీలో కానీ చేరేందుకు ఆలోచన చేస్తున్నట్లు ప్రచారం నడుస్తోంది. జనసేనలో ఉండే తోట చంద్రశేఖర్ను పిలిచి మరి కెసిఆర్ బిఆర్ఎస్ ఏపీ భాధ్యతలను అప్పగించారు. కానీ తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో, తరువాత సార్వత్రిక ఎన్నికల్లో భారత రాష్ట్ర సమితి ఘోరంగా ఓడిపోవడంతో ఆ పార్టీ ఉనికి ఏపీలో లేకుండా పోయింది.

**ప్రజారాజ్యం ద్వారా ఎంట్రీ..**

ప్రజారాజ్యం పార్టీలో చాలా యాక్టివ్ గా పని చేశారు తోట చంద్రశేఖర్. అందుకే కొద్ది రోజుల కిందట మెగాస్టార్ చిరంజీవితో ప్రత్యేకంగా సమావేశం అయ్యారు. అయితే జనసేనలో తిరిగి చెరేందుకు మెగాస్టార్ సాయం తీసుకున్నారన్న ప్రచారం జరిగింది. కానీ జనసేన నుంచి ఆయనకు సానుకూల స్పందన రాలేదని తెలుస్తోంది. ప్రస్తుతం ఆయన సొంత మీడియాలో కూడా జనసేనకు వ్యతిరేకంగా వార్తలు వస్తున్న నేపథ్యంలో.. బిజెపిలో కానీ.. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీలో కానీ చేరుతారని తెలుస్తోంది.

**దాదాపు అన్ని పార్టీల్లో..**

కాపు సామాజిక వర్గానికి చెందిన తోట చంద్రశేఖర్ పూర్వాశ్రమంలో ఐఎఫ్ఎస్ అధికారిగా పనిచేశారు. ముంబై మున్సిపల్ కార్పొరేషన్ అధికారిగా మంచి గుర్తింపు సాధించారు. చిరంజీవి ప్రజారాజ్యం పార్టీ ఏర్పాటు చేయడంతో ఆ పార్టీలో చేరారు. తర్వాత జగన్ వైసీపీ ఏర్పాటు చేయడంతో ఆ పార్టీలో కూడా చేరారు. జనసేన పార్టీలో కూడా చేరి సేవలందించారు. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీతో పాటు జనసేన తరపున పోటీ చేసి ఓడిపోయారు. మొన్నటి ఎన్నికలకు ముందు కేసీఆర్ పిలుపుతో భారత రాష్ట్ర సమితి ఏపీ బాధ్యతలను తీసుకున్నారు. ఆ పార్టీ దారుణంగా ఓడిపోవడంతో తోట చంద్రశేఖర్ రాజకీయ భవితవ్యం లేకుండా పోయింది.

**వైసిపి వైపే ఛాన్స్...**

ప్రస్తుతం కాపు సామాజిక వర్గాన్ని అస్త్రంగా మార్చుకొని కూటమిపై పోరాటం చేస్తోంది వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ. ఇటువంటి సమయంలో తోట చంద్రశేఖర్ వస్తామంటే వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ వద్దనదు. గుంటూరు జిల్లాలోని ఒక నియోజకవర్గం నుంచి పోటీ చేయాలని తోట చంద్రశేఖర్ భావిస్తున్నారు. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నుంచి హామీ లభిస్తే ఆ పార్టీలో చేరిక కు ముహూర్తం నిర్ణయిస్తారని తెలుస్తోంది. గుంటూరు పశ్చిమ నియోజకవర్గం లో బలమైన నేతగా ఉన్నారు చంద్రశేఖర్. సామాజిక వర్గ పరంగా, ఆర్థికంగా బలమైన నేత కావడంతో ఆయన చేరికకు పెద్దగా అభ్యంతరాలు ఉండకపోవచ్చు. ఇప్పటికే వైసీపీ సానుకూలత వ్యక్తం చేసినట్లు తెలుస్తోంది. అయితే తరచూ పార్టీలు మారడం ద్వారా పొలిటికల్ డామేజ్ జరిగింది. అందుకే ఈసారి ఆచితూచి నిర్ణయం తీసుకోవాలని తోట చంద్రశేఖర్ భావిస్తున్నారు.

## తుంగతుర్తి ప్రజలు నన్ను క్షమించాలి


(మొదటి పేజీ తరువాయి)

స్పందించారు. తుంగతుర్తి కాంగ్రెస్ నేతలకు తాను క్షమాపణలు చెబుతున్నానని అన్నారు. భువనగిరిలో ఆయన మీడియాతో మాట్లాడుతూ ఎమ్మెల్యేగా సామేల్‌ను గౌరవిస్తాం.. ఆయన మాటలకు స్పందించ వద్దంటూ కార్యకర్తలకు సూచించారు. తప్పుడు వ్యక్తిని బరిలోకి దింపి గెలిపించానని ఈ సందర్భంగా రాజగోపాల్ రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. తాను ఎవరికీ వ్యతిరేకం కాదన్నారు. ఆయారాం గయారాంలకు తాను భయపడనని స్పష్టం చేశారు. బీఆర్ఎస్ పార్టీ నుంచి వచ్చిన వాళ్లను గౌరవిస్తానని తెలిపారు. ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేసి పార్టీ మారింది తాను ఒక్కడినే అని ఈ సందర్భంగా ఆయన గుర్తు చేశారు. ఎమ్మెల్యే మందుల సామేల్‌పై తానెప్పుడు వ్యక్తిగతంగా మాట్లాడలేదన్నారు. రాష్ట్రంలో తాను అడిగింది రెండు సీట్లలో తుంగతుర్తి ఒకటిని చెప్పారు. మందుల సామేల్‌కు టికెట్ ఇప్పించి.. ఆయన గెలుపునకు సహకరించానని చెప్పారు. తన అభిమానుల మద్దతుతో గెలిచి.. నేడు తనపై విమర్శలు చేయడం ఎంత వరకు సమంజసం అని ఆయన ప్రశ్నించారు. కాంగ్రెస్ పార్టీలో నిజమైన కార్యకర్తలను కాపాడుకోవడమే తన లక్ష్యమని తెలిపారు. వారి న్యాయం చేసేందుకు పీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్, పార్టీ వ్యవహారాల బాధ్యురాలు మీనాక్షి నటరాజన్ చొరవ తీసుకోవాలని ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి కోరారు. తనని నమ్మి సామేల్‌ను గెలిపించినందుకు తుంగతుర్తి ప్రజలు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తనని క్షమించాలని కోరారు. సామేల్ ఎలాంటి విమర్శలు చేసినా కోమటిరెడ్డి బ్రదర్స్ అభిమానులు, కాంగ్రెస్ కార్యకర్తలు సహనంతో ఉండాలి. కొత్తగా పార్టీలోకి వచ్చిన వారిని గౌరవిస్తాం. అదే సమయంలో పాత కార్యకర్తలను విస్మరించిన వారిని ఇబ్బందులకు గురిచేస్తే చూస్తూ ఊరుకునేది లేదు.

నల్లగొండ నిఘా ప్రతినిధి(క్రైమ్ మిర్రర్)

ఒకవైపు గ్రామపంచాయతీ, మండల అధికారులు "కోళ్ల ఫారాలకు ఎలాంటి అనుమతులు ఇవ్వలేదని, అధికారికంగా లిఖితపూర్వకంగా సమాధానం ఇస్తుండగా, మరోవైపు అదే ప్రాంతంలో భారీ ఎత్తున కోళ్ల ఫారాలు, గోడౌన్లు, కార్మికుల నివాస సముదాయాలు నిర్మాణం జరగడం, జిల్లాలోని మర్రిగూడ మండలంలో తీవ్ర చర్చనీయాంశంగా మారింది! నిబంధనలకు విరుద్ధంగా నిర్మాణాలు కొనసాగుతున్నాయని, గ్రామస్తులు జిల్లా ఉన్నత అధికారులకు సైతం పలుమార్లు ఫిర్యాదులు చేసినప్పటికీ, అధికారులు చర్యలు తీసుకోకపోవడం వెనుక కారణాలేమిటన్న ప్రశ్నలు వ్యక్తమవుతున్నాయి.!! అధికారులే అనుమతులు లేవని చెబుతున్నప్పటికీ, నిర్మాణాలు మాత్రం రోజురోజుకూ విస్తరిస్తుండడం పరిపాలనా వైఫల్యమా? లేక అక్రమాలకు అధికారుల మౌన సహకారమా? అనే ప్రశ్నలు వినిపిస్తున్నాయి.?







# నల్లగొండ కలెక్టర్ గారు...

## అనుమతులు లేవని అధికారులే చెబుతుంటే...

# ఇదేమి తీరు?

## అక్రమ కోళ్ల ఫారాల నిర్మాణాలకు అడ్డుకట్ట ఎక్కడ.?



పంచాయతీ కార్యదర్శి సంబంధిత వ్యక్తికి గ్రామపంచాయతీ రాజ్ చట్టం-2018లోని, సెక్షన్ 113, 114, జిఓఎంఎస్. నెం.67 (పిఆర్‌డఆర్డి) నిబంధనలను ప్రస్తావిస్తూ నోటీసులు జారీ చేశారు. సంబంధిత నిర్మాణాలకు గ్రామపంచాయతీ అనుమతి తీసుకోకుండా, నిర్మాణాలు చేపట్టడం చట్టవిరుద్ధమని పేర్కొంటూ, వెంటనే అవసరమైన అనుమతులు పొందాలని సూచించారు. అనుమతులు తీసుకోకుండా నిర్మాణాలు కొనసాగిస్తే, చట్టపరమైన చర్యలు తీసుకునే అవకాశం ఉందని కూడా నోటీసులో పేర్కొన్నారు. నోటీసులు ఇచ్చిన తర్వాత కూడా నిర్మాణాలు ఎక్కడా ఆగలేదని, అధికారులు ఒక్కరోజు కూడా పనులు నిలిపివేయలేదని వారు ఆరోపిస్తున్నారు. కేవలం నోటీసులు జారీ చేసి తమ బాధ్యత పూర్తయినట్లుగా, వ్యవహరించారని గ్రామస్థులు మండిపడుతున్నారు.

### నిరభ్యంతర పత్రం మాత్రమే... నిర్మాణ అనుమతి కాదని అధికారుల స్పష్టీకరణ

సమాచార హక్కు చట్టం కింద దాఖలైన దరఖాస్తుకు, మండల అభివృద్ధి అధికారి కార్యాలయం నుంచి ఇచ్చిన సమాధానంలో, దామెర భీమనపల్లి గ్రామంలో ప్రతిపాదిత కోళ్ల ఫారానికి, గ్రామపంచాయతీ నిర్మాణ అనుమతి ఇవ్వలేదని, కేవలం ఇతర శాఖల నుంచి అనుమతులు పొందేందుకు అవసరమైన నిరభ్యంతర పత్రం, మాత్రమే జారీ చేసినట్లు స్పష్టం చేసినట్లు తెలుస్తోంది. ఈ సమాధానంతో ఒక కీలక అంశం వెలుగులోకి వచ్చింది. నిర్మాణ అనుమతి లేకుండానే నిర్మాణాలు కొనసాగుతున్నాయనే విషయం, అధికారుల ద్వారానే వెల్లడవుతున్నట్లు కనిపిస్తోంది. అలాంటప్పుడు సంబంధిత నిర్మాణాలను నిలిపివేయాల్సిన బాధ్యత ఎవరిది? నిర్మాణాలు పూర్తయ్యే వరకు అధికారులు ఎందుకు వేచి చూస్తున్నారు? అనే ప్రశ్నలకు ఇప్పటికీ సమాధానం లభించలేదని గ్రామస్థులు అంటున్నారు.గ్రామస్థుల కథనం ప్రకారం ఇప్పటికే ఒక కోళ్ల ఫారం, పూర్తిస్థాయిలో నిర్మాణం పూర్తి చేసుకుని నిర్వహణ కూడా కొనసాగుతోంది. ఇప్పుడు అదే ప్రాంగణంలో మరిన్ని కోళ్ల షెడ్లు, గోడౌన్లు, కార్మికుల కోసం నివాస గదులు వేగంగా నిర్మిస్తున్నారని ప్రజలు అంటున్నారు. గత నెల రోజులుగా ప్రతిరోజూ 40 నుంచి 50 మంది కార్మికులతో, పనులు కొనసాగుతున్నా సంబంధిత శాఖ అధికారుల నుంచి ఎలాంటి అడ్డుకట్ట లేదని గ్రామస్తులు పేర్కొంటున్నారు.



### ఫిర్యాదులపై స్పందన శూన్యం... గ్రామ ఆరోగ్యంపై పెరుగుతున్న ఆందోళన

**కో**ళ్ల ఫారాల కారణంగా గ్రామంలో దుర్వాసన, ఈగలు, దోమలు, ఇతర క్రిమికీటకాల సమస్య తీవ్రంగా పెరిగిందని గ్రామస్తులు అంటున్నారు.! దీంతో చిన్నపిల్లలు, వృద్ధులు, అనారోగ్యంతో బాధపడుతున్న వారు, మరింత ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. గ్రామంలో ఇప్పటికే ఆరోగ్య సమస్యలు అధికమవుతున్నాయని, భవిష్యత్తులో పరిస్థితి మరింత దిగజారే ప్రమాదం ఉందని వారు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. స్థానిక ప్రజలు పలుమార్లు గ్రామపంచాయతీ, మండల అధికారులు, ఇతర సంబంధిత శాఖలకు వినతి పత్రాలు అందజేసినా, నిర్మాణాలు ఆపేందుకు ఎలాంటి చర్యలు కనిపించలేదని చెబుతున్నారు. అధికారులు క్షేత్రస్థాయిలో తనిఖీలు నిర్వహించి చట్టప్రకారం చర్యలు తీసుకుని ఉంటే, పరిస్థితి ఇంత దూరం వచ్చేది కాదని గ్రామస్తులు అభిప్రాయపడుతున్నారు.

### అధికారిక లేఖలే ప్రశ్నలు లేవనెత్తుతున్నాయా?

ఈ వ్యవహారంలో ప్రస్తుతం ప్రధానంగా చర్చనీయాంశంగా మారింది అధికారిక రికార్డులే. ఒకవైపు పంచాయతీ కార్యదర్శి నోటీసులు జారీ చేయడం, మరోవైపు ఎంపీడీవో కార్యాలయం నిర్మాణ అనుమతులు లేవని, లిఖితపూర్వకంగా తెలియజేయడం జరిగినప్పటికీ, క్షేత్రస్థాయిలో నిర్మాణాలు నిరంతరాయంగా కొనసాగడం అనేక సందేహాలకు దారితీస్తోంది. అనుమతులు లేకుంటే నిర్మాణాలు ఎలా కొనసాగుతున్నాయి? చట్టవిరుద్ధమని గుర్తించిన తర్వాత వాటిని నిలిపివేయాల్సిన బాధ్యత ఏ శాఖదీ? నోటీసులు ఇచ్చిన తర్వాత కూడా చర్యలు ఎందుకు తీసుకోలేదు? ప్రజల ఫిర్యాదులు ఎందుకు పట్టించుకోలేదు? అనే ప్రశ్నలకు సంబంధిత అధికారులు సమాధానం ఇవ్వాల్సిన అవసరం ఉందని స్థానికులు కోరుతున్నారు. గ్రామస్తులు ఇప్పుడు జిల్లా కలెక్టర్ జోక్యం చేసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు. మొత్తం వ్యవహారంపై ఉన్నతస్థాయి అధికారులు విచారణ జరిపి, అనుమతులు లేకుండా నిర్మాణాలు జరిగితే వెంటనే నిలిపివేయాలని, అవసరమైతే చట్టపరమైన చర్యలు తీసుకుని, అక్రమ నిర్మాణాలను తొలగించాలని వారు డిమాండ్ చేస్తున్నారు. ప్రజారోగ్యం, పర్యావరణ పరిరక్షణ, గ్రామపంచాయతీ చట్టాల అమలు అన్నీ సమానంగా ముఖ్యమైనవేనని, వాటిని కాపాడే బాధ్యత ప్రభుత్వ యంత్రాంగంపైనే ఉందని నిపుణులు అంటున్నారు.

## గ్రేటర్‌పై బిజెపి గురి!

గట్టి ప్రణాళికతో ఉంది. అందులో భాగంగా గ్రేటర్ ఎన్నికలను సెమీఫైనల్స్ గా భావిస్తోంది. గ్రేటర్ లో జరగాల్సిన మూడు కార్పొరేషన్ల ఎన్నికలపై భారతీయ జనతా పార్టీ ఫుల్ ఫోకస్ పెట్టింది. గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని మూడు ప్రధాన కార్పోరేషన్లతో పాటు నార్త్ తెలంగాణకు గుండెకాయ లాంటి వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ ను ఎలాగైనా కైవసం చేసుకోవాలని చూస్తోంది. ఈ నాలుగు కార్పొరేషన్లను సాధించి.. తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల తో పాటు సార్వత్రిక ఎన్నికల్లో సత్తా చాటాలని చూస్తోంది కాషాయ పార్టీ.

**క్యూ కడుతున్న నేతలు..:** బెంగాల్ విజయం తర్వాత తమ తదుపరి టార్గెట్ తెలంగాణ అని ప్రకటించిన సంగతి తెలిసిందే. అందుకే అగ్రనేతలు తెలంగాణకు క్యూ కడుతున్నారు. ప్రధాని నరేంద్ర మోడీ పదివేల కోట్ల అభివృద్ధి పనులకు హైదరాబాదులో శ్రీకారం చుట్టారు కూడా. ఇటీవల పార్టీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబీన్ మూడు రోజులపాటు రాష్ట్రంలో పర్యటించారు. గ్రేటర్ హైదరాబాద్, సైబరాబాద్, మల్కాజ్గిరి కార్పొరేషన్ల పరిధిలో బూత్ ప్రెసిడెంట్ ల తో, రాష్ట్ర కార్యవర్గం ప్రతినిధులతో కీలక భేటీలు నిర్వహించారు. పార్టీ అగ్ర నాయకులను కలుసుకొని ఇక్కడి పరిస్థితులపై ఆరా తీశారు. ముఖ్యంగా నేతల మధ్య సమన్వయ లోపాన్ని గుర్తించారు.

**బ్లూ ప్రింట్ ఖరారు..**

గ్రేటర్ ఎన్నికలను ప్రతిష్టాత్మకంగా తీసుకుంటోంది బిజెపి. అందుకు అవసరం అయిన బ్లూ ప్రింట్ ను ఖరారు చేసింది. గత పార్లమెంట్ ఎన్నికల్లో హైదరాబాద్ పరిసర ప్రాంతాల్లో.. వరంగల్ నగర పరిధిలో బిజెపి భారీ ఓటు షేర్ సాధించింది. కొన్ని సీట్లను సైతం సొంతం చేసుకుంది. గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో కేవలం సోషల్ మీడియా ప్రచారాలకే పరిమితం కాకుండా.. ప్రతి డివిజన్లోనూ బలమైన ఆర్థిక, అంగ బలం ఉన్న అభ్యర్థులను గుర్తించి వారికి రూట్ మ్యాప్ ఇవ్వాలని.. ఎన్నికల ఖర్చులకు వెనకాడకుండా వనరులను ముందే సమకూర్చాలని బిజెపి హై కమాండ్ భావిస్తున్నట్లు తెలుస్తోంది.

**అభ్యర్థుల ఖరారు పై దృష్టి..:** గ్రేటర్ హైదరాబాద్ పరిధిలోని మూడు కార్పొరేషన్ల తో పాటు వరంగల్ కార్పొరేషన్ లో అభ్యర్థుల ఖరారు పై బిజెపి దృష్టి పెట్టింది. ఒకవైపు సిట్టింగ్ కార్పొరేటర్ల పనితీరు.. ఇంకోవైపు ఆశావహులకు సంబంధించిన పనితీరును ఎప్పటికప్పుడు తెలుసుకునే ప్రయత్నం చేసింది. సర్వేలు నిర్వహించి నేతల బలాబలాలను గుర్తిస్తుంది. ఈ సర్వే నివేదికల ఆధారంగానే టిక్కెట్లు ఇచ్చేందుకు నిర్ణయించింది. ముఖ్యంగా వరంగల్ కార్పొరేషన్ పరిధిలో కాషాయ జెండా ఎగురవేయాలన్న కృత నిశ్చయంతో ఉంది. అక్కడ భారత రాష్ట్ర సమితి ఓటు బ్యాంకు క్రమంగా పడిపోతోంది. మరోవైపు కాంగ్రెస్ అంతర్గత విభేదాలు తమకు కలిసి వస్తాయని కమలనాథులు అంచనా వేస్తున్నారు. హైదరాబాద్ పరిధిలోని సైబరాబాద్, మల్కాజ్గిరి ఐటి, అర్బన్ ఓటర్లను ఆకర్షించేందుకు ప్రత్యేకంగా కేంద్ర ప్రభుత్వ అభివృద్ధి పథకాలను ప్రచార అస్త్రాలుగా మార్చుకుంది.

**ఆ రెండు పార్టీలపై అలా..:** ఒకవైపు భారత రాష్ట్ర సమితి ద్వితీయ శ్రేణి క్యాడర్ను ఆకర్షిస్తూనే.. ఇంకోవైపు కాంగ్రెస్ పార్టీ మైనస్లపై దృష్టి పెట్టింది బిజెపి. ఎంఐఎం తో కాంగ్రెస్ దోస్తీని హైలెట్ చేయాలని చూస్తోంది. హిందుత్వ ఓటర్లను ఏకతాటిపైకి తెచ్చి మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల్లో లబ్ధి పొందాలని చూస్తోంది.

# విజయసాయిరెడ్డి పొలిటికల్ సైలెన్స్!

(మొదటి పేజీ తరువాయి)

దీని పైనే చర్చ నడుస్తోంది. తన రాజకీయ ప్రవేశం పై జూలై నెలలో క్లారిటీ ఇస్తానని విజయసాయిరెడ్డి ప్రకటించిన సంగతి తెలిసిందే. కానీ ఇప్పుడు జూలై చివరి వారం దాటుతున్నా.. విజయసాయిరెడ్డి నుంచి ఎటువంటి ప్రకటన రాలేదు. ముఖ్యంగా ఆయన బిజెపిలో చేరుతారన్న ప్రచారాన్ని ఖండించలేదు. ఆ పార్టీకి అనుకూలమైన ప్రకటనలు చేస్తూనే ఉన్నారు.

**వైసీపీలో ఒక వెలుగు..**

వైయస్సార్ కాంగ్రెస్ పార్టీలో ఒక వెలుగు వెలిగారు విజయసాయిరెడ్డి. వైయస్ రాజశేఖర్ రెడ్డి కుటుంబ ఆడిటర్ గా గుర్తింపు పొందారు. అలా ఆ కుటుంబంతో ఎంతో సాన్నిహిత్యం పెంచుకున్నారు. జగన్మోహన్ రెడ్డితో ట్రావెల్ చేశారు సుదీర్ఘకాలం. అయితే అక్రమాస్తుల కేసుల్లో జగన్ రెడ్డితో పాటు విజయసాయిరెడ్డి కూడా నిందితుడిగా మారిపోయారు. 16 నెలల జైలు జీవితం అనుభవించారు. అదే సమయంలో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఏర్పాటు, ఆ పార్టీ అభివృద్ధిలో కీలకపాత్ర పోషించారు. అందుకే అధికారంలోకి వచ్చిన తరువాత జగన్మోహన్ రెడ్డి ఎంతో ప్రాధాన్యం ఇచ్చారు. కానీ మొన్నటి ఎన్నికల్లో వైసిపి ఓడిపోయిన తరువాత విజయసాయిరెడ్డి వైఖరిలో మార్పు వచ్చింది. ఆ పార్టీని విభేదించి గుడ్ బై చెప్పారు. రాజకీయాలనుంచి తప్పుకుంటున్నట్లు ప్రకటించారు. కానీ రాజకీయ ప్రకటనలు చేస్తూనే ఉన్నారు. కొద్దిరోజుల కిందట జూలైలో రాజకీయ ప్రకటన చేస్తానని చెప్పుకొచ్చారు. ఇప్పుడు జూలై దాటుతున్న ఎటువంటి చప్పుడు లేదు.

## వైసీపీలో అవకాశం లేనట్టే..

మరోవైపు విజయసాయిరెడ్డి తిరిగి వైసీపీలోకి వెళ్లిపోతారన్న ప్రచారం కూడా జోరుగా సాగింది. కానీ అక్కడ జగన్మోహన్ రెడ్డి పెద్దగా ఆసక్తి చూపడం లేదని ప్రచారంలో ఉంది. ఎంతో ప్రాధాన్యత ఇస్తే విజయసాయిరెడ్డి కష్టకాలంలో ఉండగా రాజ్యసభ పదవిని వదులుకొని మరి బయటకు వెళ్లిపోవడాన్ని జగన్మోహన్ రెడ్డి జీర్ణించుకోలేకపోతున్నారని తెలుస్తోంది. ప్రస్తుతం విజయసాయి రెడ్డికి ఉన్న ఏకైక ఆప్షన్ బిజెపి. ఎందుకంటే సొంత రాజకీయ పార్టీ ఏర్పాటు చేసే శక్తి, యుక్తి విజయసాయిరెడ్డికి లేదు. అందుకే టిడిపి కూటమికి సహకరించేందుకు విజయసాయిరెడ్డి మనస్ఫూర్తిగా ముందుకు వస్తే మాత్రం ఆయనకు బిజెపిలో చేరేందుకు ఛాన్స్ దొరుకుతుంది. అది కూడా చంద్రబాబు, పవన్ సమ్మతిస్తేనే సాధ్యం అవుతుంది. మరి ఏం జరుగుతుందో చూడాలి.

**ఆ రెండు పార్టీల అభ్యంతరాలతో..**

భారతీయ జనతా పార్టీలో చేరేందుకు విజయసాయిరెడ్డి గట్టి ప్రయత్నాలు చేసినట్లు అర్థం అవుతుంది. కానీ భారతీయ జనతా పార్టీకి భాగస్వామ్య పార్టీలుగా ఉన్నాయి టిడిపి, జనసేన. ఆ పార్టీల నుంచి అభ్యంతరాలు రావడంతో బిజెపి వెనక్కి తగ్గింది. అయితే ఇంతలో మీడియా రంగంలో అడుగు పెట్టాలనుకున్నారు విజయసాయిరెడ్డి. హైదరాబాదులో ఓ పాత టీవీ ఛానల్ కొనుగోలు చేసేందుకు బేరం ఆడారు. కానీ అది వర్క్ అవుట్ కాలేదు. అందుకే డిజిటల్ మీడియా ఏర్పాటులో తల మునకలై ఉన్నారు. అది కొలిక్కి వచ్చిన తర్వాత విజయసాయిరెడ్డి రాజకీయ ప్రకటన చేస్తారని తెలుస్తోంది.

# ఇప్పుడు మౌనం వహిస్తే.. మరెప్పుడూ ప్రశ్నించలేం

### ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేసేవరకు వెనక్కి తగ్గం

### విద్యార్థుల భవిష్యత్ కోసమే తమ ఆందోళన


### కాక్రోచ్ పార్టీ వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కే వెల్లడి

న్యూఢిల్లీ: కేంద్ర విద్యా శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేసే వరకూ తమ ఆందోళనలు కొనసాగుతాయని కాక్రోచ్ జనతా పార్టీ స్పష్టం చేసింది. అదే తమ ప్రధాన డిమాండ్ అని తెలిపింది. గతంలో తమకు ఆందోళనలు చేసిన నేపథ్యం ఏమీ లేదని.. విద్యార్థుల భవిష్యత్తు కోసమే పోరాటం కొనసాగిస్తున్నామని సీజేపీ వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కే వెల్లడించారు. విద్యా వ్యవస్థ నాశనమైనందుకు దేశంలో యువకులు ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని.. అందుకే కేంద్రాన్ని ప్రశ్నిస్తున్నామన్నారు. కొందరు వ్యక్తులకు భయపడి ప్రశ్నించకపోతే భవిష్యత్తు ఉండదని.. ఇప్పుడు మౌనం వహిస్తే, దేశం ఇంకెప్పటికీ ముందుకు సాగదని వ్యాఖ్యానించారు. దేశవ్యాప్తంగా నిరసనలు కొనసాగు తున్నాయని.. ప్రజల మద్దతును ఎప్పటికీ మరిచిపోబోమని దీప్కే పేర్కొన్నారు. యువత మద్దతుతోనే ఇన్ని రోజులు జంతర్‌మంతర్ వద్ద నిరసనలు కొనసాగిస్తున్నట్లు తెలిపారు. చర్చల కోసం తాము కేంద్రమంత్రి జేపీనడ్డా నివాసానికి వెళ్లబోమని.. జంతర్‌మంతర్ వద్దే చర్చలు జరగాలని డిమాండ్ చేశారు. కేంద్రంతో చర్చలు తటస్థ వేదికపైనే జరుగుతాయని స్పష్టం చేశారు. ధర్మేంద్ర ప్రధాన్‌ను మంత్రివర్గం నుంచి తప్పించడమే.. ఈ విషయంలో తీసుకునే కఠిన చర్య అని పేర్కొన్నారు. విద్యార్థులపై ఢిల్లీ పోలీసుల దమనకాండను ఖండించారు. సీజేపీ నేడు దేశవ్యాప్తంగా ఆందోళనలకు పిలుపునిచ్చింది. ఈ క్రమంలో ఢిల్లీలోని జంతర్‌మంతర్ వద్దకు వేల సంఖ్యలో యువకులు చేరుకుంటున్నారు. దీంతో అక్కడ పెద్ద ఎత్తున భద్రతాబలగాలను మోహరించారు.










# కందుకూరు మండలంలో సీలింగ్ భూముల క్రయ, విక్రయాలు ?!

- పులిమామిడి రెవెన్యూ పరిధిలోని పెద్దమ్మ తండాలో 28 ఎకరాల సీలింగ్ భూములను రైతుల నుంచి కొనుగోలు చేసిన రియాల్టర్లు
- సీలింగ్ భూముల విక్రయాలు చట్ట విరుద్ధం... రైతులకు సాగు చేసుకునే హక్కు మాత్రమే ఉండగా వాటిని విక్రయించారని రెవిన్యూ అధికారులకు ఫిర్యాదులు
- సీలింగ్ భూములు అమ్మినా, కొనుగోలు చేసిన చట్ట వ్యతిరేకమే
- సర్వే నెంబర్ 74, 75లలోని సీలింగ్ భూములలో రియల్ వెంచర్ల ఏర్పాట్లకు సన్నాహాలు
- సీలింగ్ భూములను విక్రయిస్తే రైతుల పట్టాలను రద్దు చేస్తామంటున్న తహసిల్దార్
- కొనుగోలు చేసిన వారిపై చట్టపరమైన చర్యలను తీసుకుంటాం





కందుకూరు మండల పరిధిలోని సీలింగ్ భూముల క్రయ విక్రయాలపై పూర్తి ఆధారాలతో సమగ్ర కథనం రేపటి సంచికలో...

# ఆధిపత్యం కాదు... ఆప్యాయతే అసలైన బలం!

**ఒక చిన్ననాటి విత్తనం మట్టి పొరలను చీల్చుకుని మొలకెత్తి, వేళ్లను భూమిలోకి బలంగా చాచుకుని, రెమ్మలు విప్పుకుని, చివరకు ఫలపుష్పాలతో నిండిన మహావృక్షంగా మారడం ప్రకృతిలోని అద్భుతాలలో ఒకటి. సరిగ్గా మన సామాజిక జీవనంలో దాంపత్య బంధం కూడా అలాంటి పరిణామ క్రమాన్నే సంతరించుకుంటుంది. వివాహమనే అత్యంత పవిత్రమైన ముహూర్త బలంతో రూపుదిద్దుకునే ఈ అపూర్వ అనుబంధం, ఆ తర్వాతి జీవిత కాలంలో ఎదురయ్యే సకల అనుభవాల ఎండావానలను, ఆటుపోట్లను అత్యంత ధీరత్వంతో తట్టుకుని నిలబడుతుంది.**



ఒకరికొకరు నీడనిచ్చే మర్రిచెట్టులా రూపాంతరం చెందుతుంది. భార్యాభర్తలంటే కేవలం ఒకే భవంతిలో కాలాన్ని గడిపే ఇద్దరు వ్యక్తులు మాత్రమే కాదు, ఒకే హృదయ స్పందనను రెండు వేర్వేరు శరీరాలలో పంచుకుంటూ జీవించే జీవన సహచరులు. భారతీయ సనాతన సంస్కృతిలో కళ్యాణాన్ని కేవలం ఒక భౌతికమైన సామాజిక ఆచారంగానో లేదా చట్టబద్ధమైన ఒప్పందంగానో ఏనాడూ పరిగణించలేదు. అది ఒక అత్యున్నత ఆధ్యాత్మిక సమ్మేళనం. సప్తపది అనే పవిత్రమైన ఏడు అడుగుల జీవన ప్రమాణంతో వేసే మొదటి అడుగుతో మొదలయ్యే ఈ ప్రయాణంలో, ఇద్దరు వేర్వేరు వ్యక్తులు తమ వ్యక్తిగతమైన నేను అనే స్వార్థ ఆలోచనా ధోరణిని పక్కనపెట్టి, మేము అనే ఒక ఉమ్మడి శక్త్యాత్మక కుటుంబ నిర్మాణానికి శ్రీకారం చుడతారు. ఈ పరివర్తనే సంతోషకరమైన దాంపత్యానికి బలమైన పునాదిగా మారుతుంది. ఈ ప్రయాణంలో భార్య కేవలం ఒక గృహిణిగానో లేదా సహచరిగానో మాత్రమే మిగిలిపోదు. భర్త మానసిక బలహీనతలను అర్థం చేసుకునే ఆప్తమిత్రురాలిగా, అతని భవిష్యత్ లక్ష్యాలను సాధించడంలో వెన్నుదన్నుగా నిలిచే కార్యసాధకురాలిగా, కష్టకాలంలో కొండంత ధైర్యం నూరిపోసే శక్త్యాత్మక రూపంగా నిలుస్తుంది. అదే రీతిలో భర్త కూడా కేవలం ఆర్థిక పోషకుడిగానో లేదా సంరక్షకుడిగానో కాక, ఆమె ఆత్మవిశ్వాసాన్ని నిరంతరం పెంపొందించే ప్రేరకుడిగా, ఆమె ఆశయాలకు ఆకాశమంత స్థానమిచ్చే నిజమైన తోడుగా వ్యవహరించాల్సి ఉంటుంది. ఈ పరస్పర గౌరవ భావం, అవగాహనా దృక్పథం లోపిస్తే ఏ బంధమూ ఎక్కువ కాలం నిలబడలేదు. ఏ మానవ సంబంధానికైనా నమ్మకమే అసలైన ప్రాణవాయువు. దంపతుల మధ్య ఉండే అక్షయమైన నమ్మకం ఒక అదృశ్యమైన, కానీ అత్యంత బలమైన అనుబంధ దారం లాంటిది. బాహ్య ప్రపంచానికి ఇది కంటికి కనిపించకపోవచ్చు, కానీ దాని అంతర్గత బలం వల్లే ఎంతటి ఆర్థిక సుడిగుండాలనైనా, కష్టాల తుఫానులనైనా ఆ జంట సునాయాసంగా ఎదుర్కొని నిలబడగలుగు తుంది. అనుకోని ధన నష్టాలు రావచ్చు, తీవ్రమైన ఆరోగ్య సమస్యలు చుట్టుముట్టవచ్చు, లేదా కుటుంబ బాధ్యతల ఒత్తిళ్లు ఊపిరి ఆడకుండా చేయవచ్చు కానీ దంపతుల మధ్య పరస్పర విశ్వాసమనేది బలంగా ఉంటే, ఎంతటి మహమ్మారి సమస్యనైనా చిరునవ్వుతో అధిగమించవచ్చు. నమ్మకమంటే కేవలం మోసం చేయకుండా ఉండటం మాత్రమే కాదు, ఒకరి అభిప్రాయాలను మరొకరు మనస్ఫూర్తిగా గౌరవించడం, భాగస్వామి నిర్ణయాలపై దృఢమైన విశ్వాసాన్ని ఉంచడం, వారి అంతర్గత భావోద్వేగాలకు తగిన విలువ ఇవ్వడం. సంసారంలో చిన్న చిన్న అపార్థాలు, సంశయాలు రావడం సహజం. అయితే వాటిని మూగనోముతో పెంచుకోకుండా, వెంటనే ముఖాముఖి సంభాషణ ద్వారా, ఎంతో ఓర్పుతో చర్చించుకుని పరిష్కరించుకునే జంటలే కాల పరీక్షకు నిలిచే నిసర్గ సుఖీ దంపతులుగా నిలుస్తారు. రెండు విభిన్న కుటుంబ నేపథ్యాల నుంచి, వేర్వేరు అలవాట్లు, స్వభావాలతో వచ్చిన ఇద్దరు వ్యక్తులు ఒకే కప్పు కింద జీవితాన్ని పంచుకోవడం సామాన్యమైన విషయమేమీ కాదు. అభిప్రాయ భేదాలు, భావాల రాపిడులు రావడం అత్యంత సహజం. అయితే ఆ విభేదాలను ఆధిపత్య ధోరణితో కాకుండా, అప్యాయతతో, ప్రేమతో సద్దుమణిగేలా చేసుకోవడమే నిజమైన వ్యక్తిత్వ పరిణతి. నేను పట్టిన ముందే నెగ్గాలి అనే అహంకారాన్ని పక్కనపెట్టి, మన కుటుంబ శ్రేయస్సుకు ఏది మంచిది? అని ఆలోచించే తత్వమే దాంపత్యాన్ని శాశ్వతం చేస్తుంది. ఇక్కడ సర్దుబాటు అంటే తన ఆత్మగౌరవాన్ని లేదా స్వభావాన్ని పూర్తిగా కోల్పోవడం ఎంతమాత్రమూ కాదు. అది ఇద్దరు వ్యక్తులు ఒకరికొకరు సముచిత స్థానాన్ని ఇచ్చుకుంటూ, ఒక నూతన, ఆనందదాయకమైన సమతుల్య వ్యవస్థను సృష్టించుకోవడం. ఇదొక గొప్ప జీవన కళ. ఈ కళను పట్టు సాధించిన దంపతులు జీవితంలో ఎన్ని ఎత్తుపల్లాలు, కష్టనష్టాలు ఎదురైనా చెదరని చిరునవ్వుతో ముందుకు సాగగలుగుతారు. విజయవంతమైన దాంపత్య జీవితానికి అనురాగం, అవగాహనలతో పాటు ఐదు ముఖ్యమైన సూత్రాలు వెన్నుదన్నుగా నిలుస్తాయి. భాగస్వామి పరిమితులను, బలహీనతలను సైతం మనస్ఫూర్తిగా స్వీకరిస్తూ ఇచ్చే పరస్పర గౌరవం బంధానికి బలమైన పునాది వేస్తుంది. ఎలాంటి దాపరికాలు లేకుండా మనసు విప్పి మాట్లాడుకునే పారదర్శకత, అభిప్రాయ భేదాలు ఎదురైనప్పుడు విచక్షణతో వ్యవహరించే ఓర్పు కుటుంబంలో ప్రశాంతతను నింపుతాయి. ఎంతటి ఉరుకుల పరుగుల జీవితంలోనైనా భాగస్వామికే మొదటి ప్రాధాన్యత ఇస్తూ, వారి చిన్న చిన్న సహాయాలకు కూడా కృతజ్ఞత తెలుపుకోవడం వల్ల ఆ అనుబంధం నిత్యనూతనంగా, ఆనందమయంగా ముందుకు సాగుతుంది. ప్రేమ అనేది ఎప్పుడూ పెద్ద పెద్ద ప్రకటనల్లోనో, ఖరీదైన కానుకల్లోనో ఉండదు. ఉదయాన్నే ఆప్యాయతతో అందించే వేడి టీ కప్పులో, ఆఫీసు ఒత్తిడి నుంచి ఇల్లు చేరిన భాగస్వామికి ఇచ్చే ఆహ్లాదకరమైన చిరునవ్వులో అది దాగి ఉంటుంది. అర్ధరాత్రి వేళ అనారోగ్యంతో ఉన్నప్పుడు నుదుటిపై చేయి వేసి నేనున్నాను, నీకేమీ కాదు అని ఇచ్చే కొండంత అభయంలో దాగి ఉంటుంది. వృద్ధాప్యంలో వణుకుతున్న చేతులతో ఒకరి చెయ్యి ఒకరు పట్టుకుని నడిచే ఆ నిశ్శబ్ద తోడులో ప్రేమ తన పరిపూర్ణతను సంతరించుకుంటుంది. దాంపత్య బంధం అనేది ఒకే రోజులో సిద్ధించే సిద్ధాంతం కాదు. అది అనునిత్యం ప్రేమానురాగాలు, సహనం, అవగాహన అనే సుగంధ ద్రవ్యాలతో నిర్మించుకునే ఒక సుందర సౌధం. రక్తసంబంధం కాకపోయినా, మనస్ఫూర్తిగా ఎంచుకున్న ఈ పవిత్ర అనుబంధంలో ప్రతిరోజూ ఒకరినొకరు గౌరవించుకుంటూ జీవించడమే మానవ జన్మకు నిజమైన పరిపూర్ణత, అర్థం.




డా .సూర్యదేవర రామకృష్ణ ,
9490754169

# వరికి బదులు ప్రత్యామ్నాయ పంటలే మేలు!

## ఎల్‌నినో ప్రభావంతో మండలంలో తీవ్ర వర్షపాత లోటు

## రైతులు నీటిని పొదుపుగా వినియోగించి ఆరుతడి పంటల సాగు చేపట్టాలి

## వ్యవసాయ శాఖ విస్తరణ అధికారి ముప్పిడి.అశోక్ కుమార్



**ఆత్మకూరు(ఎం),జూలై24/క్రైమ్ మిర్రర్:** యాదాద్రి భువనగిరి జిల్లా ఆత్మకూరు(ఎం)మండలంలో ఎల్‌నినో ప్రభావంతో తీవ్ర వర్షాభావ పరిస్థితులు నెలకొన్న నేపథ్యంలో రైతులు నీటి లభ్యతను దృష్టిలో ఉంచుకుని ప్రత్యామ్నాయ పంటల సాగుపై దృష్టి సారించాలని వ్యవసాయ విస్తరణ అధికారి ముప్పిడీ. అశోక్ కుమార్ సూచించారు. శుక్రవారం రోజు ఆత్మకూరు (ఎం)మండలంలోని రాఘావపురం గ్రామపంచాయతీ ఆవరణంలో రైతులకు ఎల్‌నినో వాతావరణ పరిస్థితులు, వర్షాభావ పరిస్థితుల్లో అనుసరించాల్సిన సాగు విధానాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మండలంలో ఈ పంటకాలంలో సాధారణంగా కురిసే వర్షాలకు బదులు లోటు వర్షపాతం నమోదుకావడం జరిగింది. ఈ పరిస్థితుల్లో రైతులు అందుబాటులో ఉన్న నీటి వనరులను అత్యంత పొదుపుగా వినియోగిస్తూ సాగు ప్రణాళికలు రూపొందించుకోవాలని సూచించారు. ఒక ఎకరం వరి పంటకు వినియోగించే నీటితో మూడు నుంచి నాలుగు ఎకరాల వరకు ఆరుతడి పంటలను సాగు చేయవచ్చని వివరించారు. వరి స్థానంలో కందులు, పొద్దుతిరుగుడు, జొన్నలు, ఆముదం వంటి ఆరుతడి పంటలతో పాటు కూరగాయల సాగు కూడా చేపట్టాలని సూచించారు. అలాగే నీటి వనరులు అందుబాటులో ఉన్న ప్రాంతాల్లో వరికి ప్రత్యామ్నాయంగా ఆయిల్ పామ్ సాగు చేయవచ్చని తెలిపారు. ఒక ఎకరం వరికి అవసరమయ్యే నీటితో రెండు ఎకరాల వరకు ఆయిల్ పామ్ సాగు సాధ్యమవుతుందని, ఈ పంటకు ప్రభుత్వం అందిస్తున్న సబ్సిడీలను రైతులు సద్విని యోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ ఎరుకల.యతీశ్వర్, వార్డ్ సభ్యులు, గ్రామ కార్యదర్శి, రైతులు పురుషోత్తం,నయి మ్,నర్సింహారెడ్డి, జాఫర్,ఆనంద్,బుచ్చిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



## ఎన్ఎస్యూఐ ఆధ్వర్యంలో జరిగిన విద్యాసంస్థల బంద్ విజయవంతం

**ఆత్మకూరు(ఎం),జూలై24/క్రైమ్ మిర్రర్:** యాదాద్రి భువనగిరి జిల్లా ఆత్మకూరు(ఎం)మండల కేంద్రంలో ఢిల్లీలో విద్యార్థులపై జరిగిన దాడిని ఖండిస్తూ శుక్రవారం రోజు మండల కేంద్రంలో గల విద్యాసంస్థల బంద్ చేసి విద్యార్థులకు నీట్ పేపర్ లీకేజీ పైన ఢిల్లీలో జరుగుతున్న నిరసనలో భాగంగా ఢిల్లీలో విద్యార్థి యువతపై జరిగిన దాడులను గురించి తెలియజేయడం జరిగింది. అలాగే కేంద్రమంత్రి ధర్మేంద్ర ప్రధాన్ వెంటనే రాజీనామా చేయాలని, ఎన్టిఏ ను రద్దు చేయాలని, ఢిల్లీలో విద్యార్థి యువతపై జరిగిన దాడులపై పారదర్శకంగా విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. విపక్ష నాయకులు రాహుల్ గాంధీని అక్రమ అరెస్టులు చేయడం సిగ్గుచేటని పేపర్ లీకేజీతో విద్యార్థుల భవిష్యత్తు నాశనమైందని గల మెత్తితే అరెస్టు చేస్తారా అంటూ ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్యూఐ మండల అధ్యక్షులు యాస సుభాష్ రెడ్డి, పట్టణ శాఖ అధ్యక్షులు లోడి మహేష్ గౌడ్,ఎన్ఎస్యూఐ నాయకులు ఎలిమినేటి సురేష్, గడ్డం హరీష్, కోల మనోజ్, వేముల నవీన్, చేపూరి సోమేశ్వరసాయి, కట్టేకోల లక్ష్మణ్, పంజాల వివేక్, ఏనుగు అరుణ్, కందడి మధు, ఎలాగందుల పవన్, ఎలాగందుల సాయి, బాసాని నితిన్, ఎలిమినేటి పవన్, మల్లం సాయి, ఉగ్గే ప్రమోద్, వరికోప్పల మణి, వరికోప్పల మనోజ్, ఎలాగందుల చరణ్, బబ్లు, వినయ్, సాయి, చరణ్, తదితరులు పాల్గొన్నారు.

## మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డికి వినతిపత్రం అందజేసిన మాజీ సర్పంచ్ నగేష్



**ఆత్మకూరు(ఎం),జూలై24/క్రైమ్ మిర్రర్::** యాదాద్రి భువనగిరి జిల్లా ఆత్మకూరు(ఎం)మండల కేంద్రం అభివృద్ధి లక్ష్యంగా మాజీ సర్పంచ్ జన్నాయికోడె నగేష్ ప్రభుత్వ విప్,ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య ఆధ్వర్యంలో రాష్ట్ర రోడ్లు మరియు భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ వినతిపత్రంలో ఆత్మకూరు(ఎం)మండల కేంద్రంలోని దుబ్బబావి నుంచి విద్యుత్ సబ్‌స్టేషన్ వరకు రోడ్డును విస్తరించి, ఆధునిక డివైడర్‌తో పాటు సెంటర్ లైటింగ్ ఏర్పాటు చేయాలని కోరారు. ఈ అభివృద్ధి పనులు ప్రజలకు మెరుగైన రవాణా సౌకర్యాలు,రోడ్డు భద్రత కల్పించడంతో పాటు మండల కేంద్రానికి మరింత ఆధునిక రూపాన్ని తీసుకురావడానికి దోహదపడతాయని వివరించారు. వినతిపై స్పందించిన మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి ప్రతిపాదనకు సానుకూలంగా స్పందిస్తూ, త్వరలోనే అవసరమైన నిధులు మంజూరు చేసి పనులు ప్రారంభించేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షులు కందడి అనంత రెడ్డి,పిఎసిఎస్ చైర్మన్ యాస లక్ష్మారెడ్డి,కాంగ్రెస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ ముద్దసాని సిద్ధులు, నాయకులు దిగోజు నరసింహాచారి,ఎద్దు వెంకన్న, పోతగాని మల్లేష్,చెరుకు శ్రీనివాస్,ఎలగందుల మహేశ్, తొండల అనిల్ కుమార్ గౌడ్, పట్టణ కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

# వరికి బదులు ప్రత్యామ్నాయ పంటలే మేలు

### ఎల్‌నినో ప్రభావంతో ఆత్మకూరు(ఎం)మండలంలో తీవ్ర వర్షపాతం లోటు

### రైతులు నీటిని పొదుపుగా వినియోగించి ఆరుతడి పంటల సాగు చేపట్టాలి



**ఆత్మకూరు(ఎం),జూలై24/క్రైమ్ మిర్రర్:** యాదాద్రి భువనగిరి జిల్లా ఆత్మకూరు(ఎం)మండలంలో ఎల్‌నినో ప్రభావంతో తీవ్ర వర్షాభావ పరిస్థితులు నెలకొన్న నేపథ్యంలో రైతులు నీటి లభ్యతను దృష్టిలో ఉంచుకుని ప్రత్యామ్నాయ పంటల సాగుపై దృష్టి సారించాలని ఆత్మకూరు(ఎం)మండల వ్యవసాయ అధికారి ఎస్ శ్రీనివాసులు సూచించారు. శుక్రవారం రోజు ఆత్మకూరు గ్రామంలో రైతులకు ఎల్‌నినో వాతావరణ పరిస్థితులు, వర్షాభావ పరిస్థితుల్లో అనుసరించాల్సిన సాగు విధానాలపై అవగాహనను రైతులకు కలిపించడం జరిగింది. ఈ సందర్భంగా ఆత్మకూరు(ఎం)క్లస్టర్ వ్యవసాయ విస్తరణ అధికారి బి రాజశేఖర్ గౌడ్ మాట్లాడుతూ ఆత్మకూరు(ఎం) మండలంలో ఈ వర్షాకాలం సీజన్‌లో సాధారణంగా కంటే తక్కువ మిల్లీమీటర్ల వర్షపాతం నమోదు కావడం జరిగిందని, ఈ పరిస్థితుల్లో రైతులు అందుబాటులో ఉన్న నీటి వనరులను అత్యంత పొదుపుగా వినియోగిస్తూ సాగుకు ప్రణాళికలు రూపొందించుకోవాలని సూచించారు. ఒక ఎకరం వరి పంటకు వినియోగించే నీటితో మూడు నుంచి నాలుగు ఎకరాల వరకు ఆరుతడి పంటలను సాగు చేయవచ్చని వివరించారు. వరి స్థానంలో కందులు,ఆముదం,పొద్దు తిరుగుడు,జొన్నలు వంటి ఆరుతడి పంటలతో పాటు కూరగాయల సాగు కూడా చేపట్టాలని సూచించారు. అలాగే నీటి వనరులు అందుబాటులో ఉన్న ప్రాంతాల్లో వరికి ప్రత్యామ్నాయంగా ఆయిల్ పామ్ సాగు చేయవచ్చని తెలిపారు. ఒక ఎకరం వరికి అవసరమయ్యే నీటితో రెండు ఎకరాల వరకు ఆయిల్ పామ్ సాగు సాధ్యమవుతుందని, ఈ పంటకు ప్రభుత్వం అందిస్తున్న సబ్సిడీలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో రైతులు,ఏఈఓ సౌమ్య , తదితరులు పాల్గొన్నారు.

## ఏఐబిఈ పరీక్షలో ఉత్తీర్ణత సాధించడం అల్లందేవిచెర్వు గ్రామానికి గర్వకారణం : ధోనురి నర్సిరెడ్డి



**సంస్థాన్ నారాయణపురం, జూలై 24(క్రైమ్ మిర్రర్):** ఏఐబిఈ పరీక్షలో ఉత్తీర్ణత సాధించిన సందర్భంగా ఉప్పల పెల్లి బాలుని అల్లందేవిచెర్వు గ్రామంలో సీపీఐ(ఎం) పార్టీ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా సీపీఎం పార్టీ నాయకులు, గ్రామ పెద్దలు కలిసి శాలువా కప్పి ఉప్పల పెల్లి బాలుని అభినందించారు. ఈ సందర్భంగా పార్టీ సీనియర్ నాయకులు ధోనురి నర్సిరెడ్డి మాట్లాడుతూ, న్యాయవాద వృత్తిలో ఆయన ఉన్నత శిఖరాలను అధిరోహించాలని, గ్రామానికి చెందిన యువతకు బాలు, విజయం ఆదర్శప్రాయమని పేర్కొన్నారు. ఏఐబిఈ పరీక్షలో విజయం సాధించడం వ్యక్తిగత విజయమే కాకుండా గ్రామానికి గర్వకారణం అని, సమాజ సేవలోనూ, న్యాయ సేవలోనూ ఉప్పల పెల్లి బాలు విశిష్ట సేవలు అందించాలని ఆకాంక్షిస్తున్నాము" అని అన్నారు. ఈ సన్మాన కార్యక్రమంలో సీపీఐ(ఎం) పార్టీ నారాయణపురం మండల కార్యదర్శివర్గ సభ్యులు జనిగల నర్సింహ, మండల కమిటీ సభ్యులు గుండు జంగయ్య, గ్రామ కార్యదర్శి గంగాదేవి బిక్షపతి, 6వ వార్డు సభ్యులు గుండు లింగస్వామి, పార్టీ సీనియర్ నాయకులు జనిగల యాదయ్య, గుండు వెంకటయ్య, దశరథ, సుర్వి రామంజయ్య, జంగయ్య, గుండు లింగయ్య, రమేష్, నర్సింహ, వెంకటేష్ మరియు కార్యకర్తలు, గ్రామ పెద్దలు, అభిమానులు మరియు స్థానిక ప్రజలు పాల్గొని బాలుకి అభినందనలు తెలియజేశారు.

# నీట్ పరీక్షలపై రాజకీయాలు మానుకోవాలి

## బీజేవైఎం జిల్లా నాయకులు మజ్జిగ నరేష్



**ఆత్మకూరు(ఎం),జూలై 24/క్రైమ్ మిర్రర్:** నీట్ పరీక్షల అంశాన్ని రాజకీయ లబ్ధి కోసం ఉపయోగించకుండా, విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని అన్ని రాజకీయ పార్టీలు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని బీజేవైఎం జిల్లా నాయకులు మజ్జిగ నరేష్ అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, నీట్ పరీక్షల ముసుగులో కాంగ్రెస్ పార్టీతో పాటు కొన్ని ప్రతిపక్షాలు రాజకీయాలు చేస్తున్నాయని, దేశ ప్రజలు ఈ పరిణామాలను నిశితంగా గమనిస్తున్నారని పేర్కొన్నారు. కొంతమంది రాజకీయ పార్టీలు, కమ్యూనిస్టు వర్గాలు దేశంలో విభజనాత్మక వాతావరణాన్ని సృష్టించే ప్రయత్నం చేస్తున్నాయని ఆయన ఆరోపించారు. ఆర్టికల్ 370, ఆర్ఎస్ఎస్ వంటి అంశాలను నీట్ పరీక్షలతో ముడిపెట్టడం సరైంది కాదని, సనాతన ధర్మానికి, ఆర్ఎస్ఎస్‌కు, నీట్ పరీక్షలకు మధ్య సంబంధం ఏమిటో ప్రజలకు వివరించాలని ప్రతిపక్షాలను ప్రశ్నించారు. విద్యార్థుల భవిష్యత్తును రాజకీయ ప్రయోజనాల కోసం పణంగా పెట్టడం బాధ్యతారాహిత్యమని పేర్కొన్న ఆయన, దేశ ప్రయోజనాల విషయంలో భారతీయ జనతా పార్టీ రాజీపడదని అన్నారు. ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలో దేశం అభివృద్ధి దిశగా ముందుకు సాగుతోందని పేర్కొంటూ, రాజకీయ విమర్శలు ప్రజాస్వామ్య పరిధిలో ఉండాలని, వ్యక్తిగత దూషణలు మరియు విభజనాత్మక రాజకీయాలకు దూరంగా ఉండాలని ఆయన సూచించారు.

## కోడిత్యాల నరేందర్ గుప్తా-పద్మ దంపతులను, సోలిపురం మల్లారెడ్డిలను సన్మానించిన పల్లెర్ల చేనేత సహకార సంఘం పాలక వర్గం



**ఆత్మకూరు(ఎం),జూలై24/క్రైమ్ మిర్రర్:** యాదాద్రి భువనగిరి జిల్లా ఆత్మకూరు(ఎం)మండలం పల్లెర్ల చేనేత సహకార సంఘం పాలక వర్గ సభ్యుల ఆధ్వర్యంలో మాజీ జడ్పీటీసీ సభ్యులు కోడిత్యాల నరేందర్ గుప్తాని వారి సతీమణి పిఏసిఎస్ డైరెక్టర్ కోడిత్యాల పద్మ నరేందర్ గుప్తాని , మాజీ ఎంపీటీసీ సభ్యులు సోలిపురం మల్లారెడ్డిని మర్యాద పూర్వకంగా కలిసి శాలువతో సన్మానించారు . అనంతరం మాజీ జడ్పీటీసీ సభ్యులు కోడిత్యాల నరేందర్ గుప్తా మాట్లాడుతూ ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య సహకారంతో చేనేత సహకార సంఘ అభివృద్ధికి నా వంతు కృషి చేస్తానని అన్నారు . ప్రభుత్వ సంక్షేమ పథకాలను చేనేత కార్మికులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు . ఈ కార్యక్రమంలో చేనేత సహకార సంఘం అధ్యక్షులు పొడుగు వెంకటేశం , మాజీ అధ్యక్షులు ఏలూరి సుదర్శన్ , కార్యదర్శి గుర్రం శ్రీనివాస్ , కోశాధికారి సాయిని పురుషోత్తం , డైరెక్టర్లు గుర్రం మల్లేష్ , వట్నాల వెంకటేష్ , ఏలూరి ధనలక్ష్మి వెంకటేశ్వర్లు , రాపోలు శ్వేత వెంకటేష్ , మాజీ ఉపాధ్యక్షులు సాయిని అశోక్ , మాజీ డైరెక్టర్ గుర్రం వాసుదేవ్ , చేనేత నాయకులు ఏలే విశ్వనాథం , గుర్రం నారాయణ , సాయిని వెంకటేష్ , ఏలూరి సిద్దిరాములు , ఏలూరి లక్ష్మయ్య , పొడుగు సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు .

## గాలి లేకుండానే విరిగిపడిన భారీ రావిచెట్టు కొమ్మ

### ఆ సమయంలో ఆ ప్రాంతంలో జనాలు ఏవ్వరు లేకపోవడంతో ఏలాంటి ప్రమాదం జరగలేదు

**ఆత్మకూరు(ఎం),జూలై24/క్రైమ్ మిర్రర్:** యాదాద్రి భువనగిరి జిల్లా ఆత్మకూరు(ఎం)మండలం తిమ్మాపురం గ్రామంలో శుక్రవారం మధ్యాహ్నం ముత్యాలమ్మ గుడిలో వంద సంవత్సరాలపైన వయస్సు కలిగి ఉన్న రావిచెట్టు కొమ్మ గాలి వీచకుండానే విరిగిపడింది. ఆ సమయంలో ఆ ప్రాంతంలో ఏవ్వరు జనాలు లేకపోవడంతో ఏలాంటి ప్రమాదం జరగలేదు. ముత్యాలమ్మ గుడికి కొద్ది దూరంలో కుర్చున్న వృద్ధ మహిళలు భయభ్రాంతులకు గురైనట్లు తెలిపారు. వారు మాట్లాడుతూ ముత్యాలమ్మ చల్లని చూపులు ఉండటం వలన ఎలాంటి ప్రమాదం జరగలేదని అన్నారు.




# సీతారామపల్లిలో ఉచిత మెగా వైద్య శిబిరం

## పరిశీలించిన జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి నరేందర్ రాథోడ్

## 123 మందికి వైద్య పరీక్షలు, ఉచితంగా మందుల పంపిణీ



**మంచిర్యాల, జూలై 24 (క్రైమ్ మిర్రర్):** పరిసరాల పరిశుభ్రతతోనే అంటువ్యాధులను అరికట్టవచ్చని జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ నరేందర్ రాథోడ్ పేర్కొన్నారు. మంచిర్యాల పురపాలక పరిధిలోని నస్పూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో శుక్రవారం సీతారామపల్లి రైతు వేదికలో ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరానికి ముఖ్య అతిథిగా హాజరైన డీఎంహెచ్ఓ మాట్లాడుతూ వర్షాల నేపథ్యంలో మలేరియా, డెంగీ, చికెన్‌గున్యా వంటి కీటక జనిత వ్యాధులు విస్తరించే అవకాశం ఉన్నందున ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ప్రతి ఒక్కరూ వారానికోసారి ఇళ్లలో, పరిసరాల్లో నీరు నిల్వ ఉండకుండా 'డ్రై డే' పాటించాలని సూచించారు. రోడ్లపక్కన అమ్మే ఈగలు వాలిన పదార్థాలను తినకూడదని, వేడి ఆహారాన్ని మాత్రమే తీసుకోవాలన్నారు. శిబిరంలో క్షయ వ్యాధి నియంత్రణలో భాగంగా పోర్టబుల్ మొబైల్ ఎక్స్‌రే యంత్రం ద్వారా ప్రజలకు ఉచితంగా ఎక్స్‌రేలు తీసి, కఫం పరీక్షలు చేశారు. జాతీయ అసంక్రమిత వ్యాధుల నియంత్రణ కార్యక్రమంలో భాగంగా 30 ఏళ్లు దాటిన వారందరికీ బీపీ, మధుమేహం పరీక్షలు నిర్వహించి, వివరాలను 'నిక్షయ్' పోర్టల్‌లో నమోదు చేశారు. క్షయ బాధితులకు స్వచ్ఛంద సంస్థల సహకారంతో పోషకాహార కిట్లు అందజేయాలని ఆదేశించారు. మాతా-శిశు సంరక్షణలో భాగంగా 14 ఏళ్లు నిండిన బాలికలకు హెచ్‌పీవీ టీకా వేయించాలని అవగాహన కల్పించారు. ఈ ఉచిత వైద్య శిబిరంలో మొత్తం 123 మందికి ఉచితంగా వైద్య పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా మాస్ మీడియా అధికారులు బుక్క వెంకటేశ్వర్, రషీద్, స్థానిక కార్పొరేటర్ సిరిమల సౌమ్య, వైద్యాధికారులు డాక్టర్ వెంకటేష్, డాక్టర్ ప్రియాంక సలోని, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ నాందేవ్, టీబీ పర్యవేక్షకులు సాయిరెడ్డి, రాజేష్, ఎంఎల్‌హెచ్‌పీలు, ఆశా కార్యకర్తలు, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.



## బీజేవైఎం జిల్లా అధ్యక్షులుగా నియామకమై తొలిసారి మండలానికి విచ్చేసిన దయ్యాల కుమారస్వామికి సన్మానం

**ఆత్మకూరు(ఎం),జూలై24/క్రైమ్ మిర్రర్:** భారతీయ జనతా యువ మోర్చా జిల్లా అధ్యక్షులుగా నియమితులై తొలిసారిగా ఆత్మకూరు(ఎం)మండల కేంద్రానికి విచ్చేసిన దయ్యాల కుమారస్వామిని మండల పార్టీ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో బిజెపి మండల పార్టీ అధ్యక్షులు గజరాజు కాశీనాథ్,చేనేత కార్మిక నాయకులు చేనేత అధ్యక్షులు పొడుగు వెంకటేశం,యువ మోర్చా అధ్యక్షులు పైల ప్రశాంత్,బండారు సాయి, యాస వెంకట్ రెడ్డి,యాస శ్రీనివాస్ రెడ్డి,ఎండి అబ్బాస్, తదితరులు పాల్గొన్నారు.

## చేనేత సహకారం సంఘం పాలక వర్గం ప్రమాణ స్వీకారం



**ఆత్మకూరు(ఎం),జూలై24/క్రైమ్ మిర్రర్:** యాదాద్రి భువనగిరి జిల్లా ఆత్మకూరు(ఎం)మండలం పల్లెర్ల చేనేత సహకార సంఘం అధ్యక్షులు పొడుగు వెంకటేశం ఆధ్వర్యంలో మోత్కూర్ పట్టణ కేంద్రంలోని ఎస్ ఎం ఫంక్షన్ హాల్లో నిర్వహించిన చేనేత సహకార సంఘ పాలక వర్గ సభ్యుల ప్రమాణ స్వీకార కార్యక్రమంలో పాల్గొని అధ్యక్షులు వంగరి రాములుని మరియు పాలక వర్గ సభ్యులను శాలువతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు . ఈ కార్యక్రమంలో చేనేత సహకార సంఘం అధ్యక్షులు పొడుగు వెంకటేశం , కార్యదర్శి గుర్రం శ్రీనివాస్ , కోశాధికారి సాయిని పురుషోత్తం , డైరెక్టర్లు గుర్రం మల్లేష్ , వట్నాల వెంకటేష్ , రాపోలు శ్వేత వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు .

## సంస్థాన్ లో ఘనంగా కేటీఆర్ పుట్టిన రోజు వేడుకలు



**సంస్థాన్ నారాయణపురం, జూలై 24(క్రైమ్ మిర్రర్)::** సంస్థాన్ నారాయణపురం మండల కేంద్రంలో కేటీఆర్ పుట్టిన రోజు వేడుకలు మండల అధ్యక్షుడు నర్రి నరసింహ ఆధ్వర్యములో ఘనంగా జరుపుకున్నారు.కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు.ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో పండ్లు బ్రెడ్ ప్యాకెట్ల పంపిణీ చేశారు ఈ కార్యక్రమంలో వివిధ గ్రామాల గ్రామ శాఖల అధ్యక్షులు,మాజీ ప్రజాప్రతినిధులు ,కార్యకర్తలు పాల్గొన్నారు.

## నరేందర్ రెడ్డి విజయం నేటి యువతకు స్ఫూర్తిదాయకం : తుంబూరు దయాకర్ రెడ్డి

**ఖమ్మం క్రైమ్ మిర్రర్ బ్యూరో:** రాకెట్ శాస్త్రవేత్త మోర్తాల నరేందర్ రెడ్డి సాధించిన విజయం నేటి యువతకు ఎంతో స్ఫూర్తిదాయకమని తెలంగాణ రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి క్యాంపు కార్యాలయ ఇన్‌చార్జి తుంబూరు దయాకర్ రెడ్డి కొనియాడారు. 'స్కైరూట్ ఏరోస్పేస్' ప్రయోగించిన 'విక్రమ్-1' రాకెట్ విజయంలో కీలక పాత్ర పోషించిన ఖమ్మం జిల్లా వాసి నరేందర్ రెడ్డిని శుక్రవారం మంత్రి పొంగులేటి క్యాంప్ కార్యాలయంలో దయాకర్ రెడ్డి శాలువాతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సామాన్య కుటుంబం నుంచి వచ్చి అంతరిక్ష పరిశోధనా రంగంలో జిల్లా ఖ్యాతిని పెంచడం అభినందనీయమన్నారు. నరేందర్ రెడ్డి భవిష్యత్తులో మరిన్ని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు.



# అంకం రాహుల్ కేసులో నిందితులను వెంటనే గుర్తించి కఠినంగా శిక్షించాలి

## హైదరాబాద్ పోలీస్ కమిషనర్‌కు బీసీ రాజ్యాధికార సమితి అధ్యక్షుడు దాసు సురేశ్ వినతి



**క్రైమ్ మిర్రర్, ఎల్బీనగర్, జూలై 24:** అంకం రాహుల్ అనుమానాస్పద మృతికి సంబంధించిన పలు కీలక అంశాలు, కేసు పూర్వాపరాలు మరియు ఇప్పటివరకు జరిగిన పరిణామాలను బీసీ రాజ్యాధికార సమితి ప్రతినిధులు నేడు సంస్థ వ్యవస్థాపక అధ్యక్షులు దాసు సురేష్ నేతృత్వంలో హైదరాబాద్ సిటీ పోలీస్ కమిషనర్ శ్రీ సజ్జనార్ గారిని కలిసి సమగ్రంగా వివరించారు. ఈ సందర్భంగా దాసు సురేష్ మాట్లాడుతూ, అంకం రాహుల్ మృతికి కారణమైన అసలు నిందితులను ఎలాంటి జాప్యం లేకుండా గుర్తించి చట్టప్రకారం అత్యంత కఠినంగా శిక్షించాలని కోరారు. ఈ కేసులో సమగ్ర, పారదర్శక విచారణ జరిపి బాధిత కుటుంబానికి న్యాయం జరిగేలా పోలీసు శాఖ చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. అదేవిధంగా, రాష్ట్రంలోని విద్యాసంస్థల్లో పెరుగుతున్న ర్యాగింగ్, గంజాయి మరియు ఇతర మాదకద్రవ్యాల వ్యసనాలు విద్యార్థుల్లో నేరప్రవృత్తిని పెంచుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. కళాశాలల యాజమాన్యాలు ఇటువంటి దురాచారాలపై కఠిన నియంత్రణ చర్యలు చేపట్టి, విద్యార్థులకు సురక్షితమైన మరియు విలువలతో కూడిన విద్యా వాతావరణాన్ని కల్పించాలని సూచించారు. మారుతున్న యువత జీవనశైలిని సన్మార్గంలో నడిపించేందుకు సామాజిక బాధ్యత కలిగిన స్వచ్ఛంద సేవా సంస్థల భాగస్వామ్యంతో కళాశాలల్లో వ్యక్తిత్వ వికాసం, నైతిక విలువలు, మాదకద్రవ్యాల నివారణ, చట్ట అవగాహన వంటి అంశాలపై నిరంతర అవగాహన కార్యక్రమాలు నిర్వహించేలా ప్రభుత్వ యంత్రాంగం మరియు విద్యాసంస్థలు సమన్వయంతో చర్యలు తీసుకోవాలని దాసు సురేష్ కోరారు. ఈ సందర్భంగా గడిచిన 50 రోజులుగా అంకం రాహుల్ తల్లిదండ్రులకు అన్ని విధాలుగా అండగా నిలిచి, న్యాయపోరాటంలో తోడ్పాటునందిస్తూ మానవతా దృక్పథంతో సేవలందించిన బీసీ రాజ్యాధికార సమితి ప్రతినిధులను హైదరాబాద్ పోలీస్ కమిషనర్ శ్రీ సజ్జనార్ ప్రత్యేకంగా అభినందించి, వారి సేవలను ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో బీసీ రాజ్యాధికార సమితి సీఈవో పోశాల సరస్వతి, సికింద్రాబాద్ పార్లమెంటరీ ఇన్‌చార్జ్ మంద వెంకటస్వామి, గ్రేటర్ హైదరాబాద్ ప్రధాన కార్యదర్శి మంద ఈశ్వర్ తదితర నాయకులు పాల్గొన్నారు.

# ఘనంగా కేటీఆర్ పుట్టినరోజు వేడుకలు

## కేక్ కట్ చేసి మిఠాయిలు పంచుకున్న బీఆర్ఎస్ శ్రేణులు

## కేటీఆర్ నాయకత్వాన్ని కొనియాడిన నాయకులు



**మర్రిగూడ(క్రైమ్ మిర్రర్):** భారత రాష్ట్ర సమితి పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్, కల్వకుంట్ల తారక రామారావు జన్మదిన వేడుకలను, మర్రిగూడ మండలంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు ఘనంగా నిర్వహించారు. మర్రిగూడ చౌరస్తాలో పెద్ద సంఖ్యలో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు ఒకచోట చేరి, కేక్ కట్ చేసి ఒకరికొకరు మిఠాయిలు తినిపించుకుంటూ, జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా పార్టీ శ్రేణులు మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్ర అభివృద్ధిలో కేటీఆర్ పోషించిన పాత్రను గుర్తు చేసుకున్నారు. యువతను రాజకీయాల్లోకి ప్రోత్సహించిన నాయకుడిగా, పారిశ్రామిక రంగానికి పెట్టుబడులను ఆకర్షించడంలో కీలక పాత్ర పోషించిన, ప్రజానాయకుడిగా కేటీఆర్‌కు ప్రత్యేక గుర్తింపు ఉందన్నారు. ఐటీ రంగ విస్తరణ, పరిశ్రమల స్థాపన, పట్టణాభివృద్ధి, మౌలిక వసతుల కల్పన, యువతకు ఉపాధి అవకాశాల సృష్టి వంటి, అంశాల్లో ఆయన కృషిని ప్రజలు ఇప్పటికీ గుర్తు చేసుకుంటున్నారని పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావం తర్వాత రాష్ట్ర అభివృద్ధిలో, కేటీఆర్ కీలక బాధ్యతలు నిర్వహించారని తెలిపారు. ఐటీ రంగంలో హైదరాబాద్‌కు అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు తీసుకురావడం, ప్రపంచ ప్రఖ్యాత సంస్థలను తెలంగాణకు ఆహ్వానించడం, పారిశ్రామిక పెట్టుబడులు పెరిగేలా కృషి చేయడం, పట్టణ మౌలిక వసతుల అభివృద్ధికి అనేక కార్యక్రమాలు చేపట్టడం వంటి అంశాలను ప్రస్తావించారు. సోషల్ మీడియాలో కూడా కేటీఆర్‌ను యువ నాయకుడిగా, ప్రజలకు అందుబాటులో ఉండే రాజకీయ నాయకుడిగా ఎదిగారన్నారు. ప్రజా సమస్యలపై సామాజిక మాధ్యమాల ద్వారా స్పందించడం, యువతతో నిరంతరం అనుసంధానంగా ఉండడం, అభివృద్ధి అంశాలపై తన అభిప్రాయాలను వెల్లడించడం వల్ల, ఆయనకు ప్రత్యేక ఆదరణ లభించిందని వ్యాఖ్యానించారు. రానున్న రోజుల్లో కేటీఆర్ ప్రజలకు మరింత సేవ చేయాలని, ఆయురారోగ్యాలతో నిండు నూరేళ్లు జీవించాలని పార్టీ నాయకులు ఆకాంక్షించారు. ఆయన నాయకత్వంలో బీఆర్ఎస్ పార్టీ మరింత బలోపేతం కావాలని, తెలంగాణ ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా రాష్ట్ర అభివృద్ధి కొనసాగాలని కోరుకున్నారు. జన్మదిన వేడుకల్లో పాల్గొన్న నాయకులు, కార్యకర్తలు "హ్యాపీ బర్త్‌డే కేటీఆర్" అంటూ నినాదాలు చేస్తూ, వేడుకలను ఉత్సాహంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపిపి మెండు మోహన్ రెడ్డి, సర్పంచ్ లు వల్లంల సంతోష్ యాదవ్, సీతారాం నాయక్, భాస్కర్, సీనియర్ నాయకులు, పాక్స్ చైర్మన్ యాదయ్య, మాజీ మాల్ మార్కెట్ కమిటీ చైర్మన్ దంటు జగదీశ్వర్, మాజీ ప్రజా ప్రతినిధులు, సీనియర్ నాయకులు విజయ రామారావు, నల్ల యాదయ్య, ఊరిపక్క నాగేష్, సురేందర్ రెడ్డి, రామన్న, కట్కూరి వెంకటేష్, అయిలి నర్సింహ, అంతిరెడ్డి, యాదగిరి, రమణారెడ్డి, ముత్యం రెడ్డి, వెంకటేష్ పార్టీ శ్రేణులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# నీట్ లీక్‌పై విద్యార్థుల ఆగ్రహం.. గుండాలలో విద్యాసంస్థల బంద్!

## "ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలి.. నీట్ రద్దు చేయాలి" అంటూ ఎస్ఎఫ్ఐ ఎన్ఎస్ యుఐ వామపక్షాల





**యాదాద్రి భువనగిరి జిల్లా బ్యూరో, జూలై 24 (క్రైమ్ మిర్రర్):** దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన నీట్ పేపర్ లీక్ వ్యవహారంపై కేంద్ర ప్రభుత్వంపై విద్యార్థి సంఘాలు తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డాయి. భారత విద్యార్థి ఫెడరేషన్ ఎస్ఎఫ్ఐ, ఎన్ఎస్ యుఐ వామపక్ష విద్యార్థి సంఘాల సంయుక్త ఆధ్వర్యంలో గుండాల మండల కేంద్రంలోని విద్యాసంస్థలను శుక్రవారం బంద్ చేసి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ మండల అధ్యక్షుడు ధార సతీష్, ఎన్ఎస్ యుఐ ఉపాధ్యక్షుడు ఏలేటి మధుకర్ మాట్లాడుతూ, నీట్ పేపర్ లీక్‌కు పూర్తి బాధ్యత కేంద్ర ప్రభుత్వానిదేనని ఆరోపించారు. కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ వెంటనే రాజీనామా చేయాలని, నీట్ పరీక్షను పూర్తిగా రద్దు చేసి విద్యార్థులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఢిల్లీలో తమ హక్కుల కోసం ఉద్యమించిన విద్యార్థులు, యువతపై జరిగిన పోలీసు దాడులను ప్రజాస్వామ్యంపై దాడిగా అభివర్ణిస్తూ, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. విద్యను కేంద్రీకరించే విధానాలను, "వికసిత్ భారత్ శిక్షా అధిష్ఠాపన బిల్లు"ను వెంటనే వెనక్కి తీసుకోవాలని కేంద్ర ప్రభుత్వాన్ని హెచ్చరించారు. విద్యార్థి వ్యతిరేక విధానాలను ప్రభుత్వం మార్చుకోకపోతే రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమాలను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరిస్తూ, గుండాల మండలంలోని విద్యాసంస్థల బంద్‌ను విజయవంతం చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ మండల కార్యదర్శి ఎం.డి. ఇర్ఫాన్, కార్యవర్గ సభ్యులు పీ. ప్రేమ్ కుమార్, అన్నెపర్తి ఉదయ్, ఎన్ఎస్ యుఐ నాయకుడు తునం అరవింద్ తదితరులు పాల్గొన్నారు.

# ఉత్కంఠ రేపుతున్న ఫిరోజ్‌నగర్ భూ వివాదం

## మూడేళ్లుగా పెండింగ్‌లో ఉన్న కేసుపై నేడు జాయింట్ కలెక్టర్ తీర్పు వెలువడే అవకాశం..







**క్రైమ్ మిర్రర్ (రంగారెడ్డి ప్రతినిధి):** రంగారెడ్డి జిల్లా మాడ్గుల మండలం నాగిళ్ల గ్రామ రెవెన్యూ పరిధిలోని ఫిరోజ్‌నగర్ గ్రామంలో 46 మంది రైతులు, మందుముల వారసుల మధ్య కొనసాగుతున్న 180.03 గుంటల ఇనాం భూమి వివాదం కీలక దశకు చేరుకుంది. గత మూడు సంవత్సరాలుగా పెండింగ్‌లో ఉన్న ఈ కేసుపై రంగారెడ్డి జిల్లా జాయింట్ కలెక్టర్ కార్యాలయంలోని ఎఫ్ సెక్షన్‌లో నేడు (శనివారం) తుది తీర్పు వెలువడే అవకాశం ఉందని గ్రామస్థులు తెలిపారు. ఈ భూమి వివాదానికి సంబంధించి గతంలో జాయింట్ కలెక్టర్ కార్యాలయం, హైకోర్టులో విచారణలు జరిగినట్లు సమాచారం. తుది తీర్పు కోసం గ్రామ ప్రజలు, మందుముల వారసులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. గ్రామస్థుల కథనం ప్రకారం, గత 70 సంవత్సరాలుగా తాము సాగు చేస్తున్న భూముల రికార్డుల్లో అక్రమ మార్పులు జరిగాయని, రైతుల పేర్లు తొలగించి మందుముల వారసుల పేర్లు నమోదు చేశారనే ఆరోపణలు ఉన్నాయి. ఈ ఆరోపణలపై సంబంధిత అధికారులు పూర్తి స్థాయిలో విచారణ జరిపి రికార్డులను పరిశీలించలేదని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అయితే, ఈ ఆరోపణలపై మందుముల వారసుల స్పందన ఇంకా తెలియరాలేదు. అలాగే సంబంధిత రెవెన్యూ అధికారుల నుంచి కూడా అధికారిక వివరణ వెలువడలేదు. నేడు వెలువడనున్న జాయింట్ కలెక్టర్ తీర్పుతో ఈ భూ వివాదానికి ముగింపు పలుకుతుందా? లేక మరో న్యాయపరమైన పోరాటానికి దారితీస్తుందా? అనే అంశంపై గ్రామంలో ఉత్కంఠ నెలకొంది. తీర్పు అనంతరం ఫిరోజ్‌నగర్‌లో ఉద్రిక్త పరిస్థితులు తలెత్తే అవకాశం ఉందని గ్రామస్థులు అభిప్రాయపడుతున్నారు. దీంతో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.



# ఘనంగా కేటీఆర్ జన్మదిన వేడుకలు

**క్రైమ్ మిర్రర్,పాలకీడు :** బిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారక రామారావు 50వ జన్మదిన వేడుకలను పాలకీడు మండల కేంద్రంలో బీఆర్ఎస్ రాష్ట్ర యువజన నాయకులు పెరుమల్ల సతీష్ ఆధ్వర్యంలో భారీగా నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తరువాత 10 సంవత్సరాలు ఐటీ శాఖ మంత్రిగా ఉండి భారత దేశంలోనే తెలంగాణ రాష్ట్రంలోని హైదరాబాదును ప్రపంచ దేశాలకు పరిచయం చేసిన మేధావి కేటీఆర్ అని కొనియాడారు .కేటీఆర్ నిండు నూరేళ్లు సుఖసంతోషాలతో ఉండాలని అన్నారు .ఇట్టి కార్యక్రమంలో మండల నాయకులు రావుల కొండలు గౌడ్ ,రవి నాయక్ ,వీరనారాయణ , , హరి ,శ్రీను, వెంకన్న జీవన్ వెంకటేశ్వర్లు ,మల్లెపల్లి కోటయ్య, వీరబాబు ,మనోజ్ సైదులు,వెంకట నాయుడు,నాగేశ్వరరావు ,మురళి శేఖర్ . కార్యకర్తలు, అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

# మిర్యాలగూడలో విద్యాసంస్థల బంద్

## నీట్ పేపర్ లీక్, విద్యార్థులపై లాఠీచార్జీకి నిరసన




**మిర్యాలగూడ క్రైమ్ మిర్రర్, జూలై 24:** నీట్ ప్రశ్నాపత్రం లీక్ వ్యవహారం, విద్యార్థులపై పోలీసుల లాఠీచార్జీ, ప్రజాస్వామ్య హక్కుల అణచివేతకు నిరసనగా ఎస్ఎఫ్ఐ, ఎన్ఎస్‌యూఐ, ఏఎస్ఎఫ్ఐ, ఏఐఎస్ఎఫ్, ఏఐఎఫ్‌డీఎస్ ఆధ్వర్యంలో శుక్రవారం మిర్యాలగూడ పట్టణంలో విద్యాసంస్థల బంద్ నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘాల రాష్ట్ర నాయకులు రాము, ఆరిఫ్, కాశి, సైదానాయక్ మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం విద్యా వ్యవస్థను నిర్వీర్యం చేస్తోందని ఆరోపించారు. లక్షలాది మంది విద్యార్థులు ఎన్నో ఏళ్లుగా శ్రమించి పోటీ పరీక్షలకు సిద్ధమవుతుంటే, నీట్ ప్రశ్నాపత్రం లీక్‌తో వారి భవిష్యత్తుతో చెలగాటమాడినట్లు విమర్శించారు. దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన నీట్ పేపర్ లీక్ పరీక్షల నిర్వహణలో వైఫల్యానికి నిదర్శనమని పేర్కొన్నారు. నీట్ లీక్‌కు నైతిక బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ వెంటనే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. వరుసగా పోటీ పరీక్షల ప్రశ్నాపత్రాలు లీక్ అవుతున్నా కేంద్ర ప్రభుత్వం అరికట్టడంలో విఫలమైందని విమర్శించారు. నీట్ లీక్‌పై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ ఢిల్లీలో నిర్వహించిన 'చలో పార్లమెంట్' కార్యక్రమంలో విద్యార్థులు, యువజన సంఘాల నాయకులపై పోలీసులు లాఠీచార్జీ చేయడాన్ని తీవ్రంగా ఖండించారు. ప్రశ్నాపత్రాలు లీక్ చేసిన వారిపై చర్యలు తీసుకోవాల్సిన ప్రభుత్వం, న్యాయం కోరుతున్న విద్యార్థులపై దమనకాండకు పాల్పడటం ప్రజాస్వామ్యానికి విరుద్ధమన్నారు. నిరుద్యోగం, పరీక్షల అక్రమాలు, విద్యారంగ సమస్యలపై ప్రశ్నించే యువత గొంతును అణచివేయాలని కేంద్రం ప్రయత్నిస్తోందని ఆరోపించారు. నీట్ పేపర్ లీక్ తదితర పరీక్షల అక్రమాల కారణంగా మానసిక వేదనకు గురై ప్రాణాలు కోల్పోయిన విద్యార్థుల కుటుంబాలకు రూ. 1 కోటి చొప్పున ఎక్స్‌గ్రేషియా ప్రకటించాలని డిమాండ్ చేశారు. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా కఠినమైన చట్టాలు తీసుకురావాలని కోరారు. సామాజిక కార్యకర్త సోనమ్ వాంగ్‌చుక్‌ను వెంటనే విడుదల చేయాలని, నీట్ పేపర్ లీక్‌పై సుప్రీంకోర్టు పర్యవేక్షణలో సమగ్ర విచారణ జరిపి దోషులను కఠినంగా శిక్షించాలని, విద్యార్థులపై లాఠీచార్జీకి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా నాయకులు జగన్, ప్రసన్న, లోహి, ఝాన్సీ, ఏఐఎస్ఎఫ్ జిల్లా నాయకులు యశ్వంత్, ఎన్ఎస్‌యూఐ నాయకులు అజయ్, న్యూమాన్, యశ్వంత్, కిరణ్, ఎస్ఎఫ్ఐ నాయకులు శివ, బన్నీ, రవి, హనుమత్, సతీష్, మనోహర్, మణి తదితరులు పాల్గొన్నారు.

# రైతులు వరికి బదులు...ఆరుతడి పంటలు వేయాలి

## కొరటికల్ లో ఎల్ నినో పై రైతులకు అవగాహన



**మునుగోడు క్రైమ్ మిర్రర్:** మునుగోడు మండలములోని కొరటికల్ గ్రామంలో ప్రస్తుత వానాకాలం సీజన్లో ఎల్ నినో పరిస్థితుల ప్రభావం ప్రత్యామ్నాయ పంటల సాగుపై జిల్లా వ్యవసాయ అధికారి ఉల్లోజు వినోద్ కుమార్ రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రస్తుత పరిస్థితుల్లో రైతులు వరి పంటకు బదులుగా ఆరుతడి పంటలైన జొన్న ,సజ్జ ,మినుములు, నువ్వులు, కంది,వేరుశెనగ ,ఆముదము వంటి పంటలు వేయాలని పంటలపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి పద్మజ , కొరటికల్ సర్పంచ్ అద్దంకి రామలింగయ్య, ఉప సర్పంచ్ మందుల అంజయ్య ,వ్యవసాయ విస్తరణ అధికారులు వెంకటేష్, నేతాజీ మరియు గ్రామ రైతులు పాల్గొన్నారు.

# కేటీఆర్ జన్మదినం సందర్భంగా "గిఫ్ట్ ఏ స్మైల్

## మూసాపేట్ ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు పుస్తకాల పంపిణీ

### విద్యే గొప్ప బహుమతిగా.. విద్యార్థుల్లో చదువుపై ఆసక్తి పెంపొందించడమే లక్ష్యం

### మాజీ కార్పొరేటర్ తూము శ్రావణ్ కుమార్



**కూకట్ పల్లి, జూలై 24 (క్రైమ్ మిర్రర్) :** బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కల్వకుంట్ల తారక రామారావు (కేటీఆర్) జన్మదినాన్ని పురస్కరించుకుని నిర్వహిస్తున్న "గిఫ్ట్ ఏ స్మైల్" సేవా కార్యక్రమాలు కూకట్ పల్లి నియోజకవర్గంలో కొనసాగుతున్నాయి. ఈ సందర్భంగా మూసాపేట్ డివిజన్‌లోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు అవసరమైన పుస్తకాలను పంపిణీ చేసి వారి ముఖాల్లో చిరునవ్వులు నింపారు. మూసాపేట్ మాజీ కార్పొరేటర్ తూము శ్రావణ్ కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో విద్యార్థులకు పుస్తకాలను అందజేస్తూ, విద్యే జీవితాన్ని మార్చే గొప్ప ఆయుధమని, ప్రతి విద్యార్థి కష్టపడి చదివి ఉన్నత లక్ష్యాలను సాధించాలని ఆకాంక్షించారు. సమాజానికి సేవ చేయాలనే ఉద్దేశంతో బీఆర్ఎస్ చేపట్టిన "గిఫ్ట్ ఏ స్మైల్" కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు ఉపయోగపడే విద్యా సామగ్రిని అందించడం ఎంతో సంతోషంగా ఉందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా పాఠశాల విద్యార్థులు పుస్తకాలను అందుకుని ఆనందం వ్యక్తం చేశారు. ఇలాంటి సేవా కార్యక్రమాలు తమలో చదువుపై మరింత ఆసక్తిని పెంపొందిస్తాయని, అవసరమైన సమయంలో అందించిన సహాయానికి నిర్వాహకులకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో డివిజన్ మాజీ అధ్యక్షులు అంబటి శ్రీనివాస్, తూము నిఖిల్ కుమార్, అరుణ్, కృష్ణ, అర్జున్, కర్క నిఖిల్, దేవేందర్, క్రాంతి తదితర బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. "గిఫ్ట్ ఏ స్మైల్" కార్యక్రమం ద్వారా కేటీఆర్ జన్మదినాన్ని వేడుకగా కాకుండా సేవా కార్యక్రమాలతో నిర్వహించడం పట్ల స్థానికులు అభినందనలు వ్యక్తం చేశారు. విద్యార్థులకు అవసరమైన విద్యా సామగ్రిని అందించడం ద్వారా వారి విద్యాభివృద్ధికి తోడ్పడే ప్రయత్నం చేయడం అభినందనీయమని పలువురు పేర్కొన్నారు.



# విద్యా గ్రూప్ ఆఫ్ స్కూల్స్‌లో విద్యార్థులకు ఆధునిక విద్యాబోధన - డైరెక్టర్ పి. త్రిమూర్తులు...

**శేరిలింగంపల్లి క్రైమ్ మిర్రర్ :** శేరిలింగంపల్లి మండల పరిధిలోనీ గచ్చిబౌలి అంజయ్య నగర్ లోని విద్యా హై స్కూల్లో శుక్రవారం రోజు అత్యాధునిక సైన్స్ టెక్నాలజీ, ఇంజనీరింగ్ అండ్ మ్యాతమెటిక ల్యాబ్ ను ఘనంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ఫెడెక్స్ మేనేజింగ్ డైరెక్టర్ రమేష్ ముఖ్య అతిథిగా హాజరై ల్యాబ్‌ను ఫెడెక్స్ బృందం సభ్యులతో కలిసి ప్రారంభించారు.

ఈ సందర్భంగా ల్యాబ్ లో విద్యార్థులు రూపొందించిన వినూత్న సైన్స్, టెక్నాలజీ మరియు రోబోటిక్స్ ప్రాజెక్టులను ప్రత్యక్షంగా ప్రదర్శించారు. విద్యార్థుల ఆలోచనా విధానం, సృజనాత్మకత, సాంకేతిక నైపుణ్యాలను రమేష్ అండ్ ఆయన బృందం అభినందిస్తూ, ఇలాంటి ప్రయోగాత్మక విద్య భవిష్యత్ తరాలకు ఎంతో ఉపయోగపడుతుందని పేర్కొన్నారు పాఠశాల డైరెక్టర్ లయన్ డా. త్రిమూర్తులు పొన్నాడ మాట్లాడుతూ పుస్తక విజ్ఞానంతో పాటు ప్రయోగాత్మక అభ్యాసమే విద్యార్థులను భవిష్యత్ సవాళ్లకు సిద్ధం చేస్తుందన్నారు. ఎస్ టి ఇ ఎం ల్యాబ్ ద్వారా విద్యార్థుల్లో శాస్త్రీయ దృక్పథం, సమస్య పరిష్కార నైపుణ్యం, సృజనాత్మకత మరియు ఆవిష్కరణల పట్ల ఆసక్తి మరింత పెరుగుతుందనీ తెలిపారు. విద్యార్థులను ప్రపంచ స్థాయి సాంకేతిక పరిజ్ఞానానికి పరిచయం చేయడమే మా లక్ష్యం. ఈ విలువైన సహకారం అందించిన ఫెడెక్స్ సంస్థకు మా హృదయపూర్వక కృతజ్ఞతలు" అని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల అడ్మిన్ సభ్యులు మధుస్మిత, సక్కుబాయి, కొండల్, బాలరాజు, రాజేందర్, ఉపాధ్యాయ బృందం మరియు సిబ్బంది పాల్గొన్నారు.

# ప్రజాస్వామ్య పరిరక్షణలో కాంగ్రెస్ పార్టీ ముందు ఉండాలి



## అర్హులైన ప్రతి ఒక్కరి పేరు ఓటర్ జాబితాలో నమోదు అయ్యేలా జాగ్రత్తలు తీసుకోవాలి

## శేరిలింగంపల్లి నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ వి జగదీశ్వర్ గౌడ్

**కూకట్ పల్లి, జూలై 24 (క్రైమ్ మిర్రర్) :** ప్రజాస్వామ్య పరిరక్షణలో కాంగ్రెస్ ముందుండాలనిస్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (సర్) కార్యక్రమంలో పాల్గొనాలని కాంగ్రెస్ పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలందరికీ శేరిలింగంపల్లి నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ వి జగదీశ్వర్ గౌడ్ దిశా నిర్దేశం చేశారు. నియోజకవర్గ పరిధిలో గల వెంకటేశ్వర నగర్ డివిజన్ పరిధిలోని ఆస్బెస్టాస్ కాలనీ, పాపి రెడ్డి నగర్, పాపారాయుడు నగర్, దీనబంధు కాలనీ, హనుమాన్ నగర్, ప్రగతి నగర్, ఆర్పి కాలనీ, వెంకటేశ్వర నగర్, రామకృష్ణ నగర్ కాలనీలోని బిఎల్ఓ/బిఎల్ఏలు, వెంకటేశ్వర నగర్ డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మందుల శివకుమార్ ఆధ్వర్యంలో స్థానిక నాయకులతో కలిసి స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (సర్) పై ఆయన సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జగదీశ్వర్ గౌడ్ మాట్లాడుతూ సర్ కార్యక్ర మాన్ని విజయవంతం చేసి, ప్రజాస్వామ్య పరిరక్షణలో పార్టీ బీఎల్ఏలు అందరూ ముందుండాలని, స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (సర్) కార్యక్రమాన్ని ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లేందుకు కాంగ్రెస్ పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, అనుబంధ విభాగాల నాయకులు, కార్యకర్తలందరూ చురుకుగా పాల్గొనాలని దిశానిర్దేశం చేశారు. ఈ కార్యక్రమంలో డీసీసీ మహిళా నాయకులు ఏకాంత్ కల్పన గౌడ్, భాష్పక యాదగిరి, ప్రగతి నగర్ వన్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు మాచర్ల విష్ణు, పట్వారీ శశిధర్, కావూరి ప్రసాద్, పరశురాం, కృష్ణ, మన్నేపల్లి సాంబశివ రావు, ముత్తయ్య, ఆంజనేయులు, పోసాల రాజు, వెంకటేష్, మెహమూద్, ఏకనాథ్, మిరాజ్, నాగేందర్, ఉదయ్, రాంచందర్ గౌడ్, రవి కుమార్, యూత్ కాంగ్రెస్ నాయకులు వసీం, ఎన్ఎస్ యుఐ అధ్యక్షులు సామ్సన్, మహిళలు విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

క్రైమ్ మిర్రర్
Voice of Anti Corruption
తెలంగాణ జిల్లాలు



# రైల్వే స్టేషన్ రోడ్ విస్తరణ పూర్తి చేయాలి: వై విక్రమ్

## ఒకవైపు వున్న ఒక బిల్డింగ్ జోలికి ఎందుకు పోవడం లేదో ప్రజలకు చెప్పాలి



**ఖమ్మం క్రైమ్ మిర్రర్ బ్యూరో:** నిత్యం వేలాదిమంది ప్రయాణించే పాత మున్సిపల్ కార్యాలయం నుంచి రైల్వే స్టేషన్ వరుకు రోడ్ విస్తరణ పనుల్లో ఎందుకు జాప్యం జరుగుతోందో నగర ప్రజలకు అధికార పార్టీ ప్రజా ప్రతినిధులు, కార్పొరేషన్ కమిషనర్ సమాధానం చెప్పాలి సిపిఎం పార్టీ ఖమ్మం డివిజన్ కార్యదర్శి వై విక్రమ్ డిమాండ్ చేశారు. సిపిఎం పార్టీ ఖమ్మం డివిజన్ కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం విస్తరణ రోడ్ పనులను పరిశీలన చేశారు. ఈ సందర్భంగా వై విక్రమ్ మాట్లాడుతూ రైల్ స్టేషన్ రహదారి విస్తరణ పనులు ఒకవైపు పూర్తి చేశారు అని రెండవ వైపు విస్తరణ పనులు ఎందుకు జరగటం లేదు అని ప్రశ్నించారు. రోడ్ మీద జీవనోపాధి కోసం చిరు వ్యాపారులు వ్యాపారం చేస్తే వెంటనే కార్పొరేషన్ అధికారులు రాత్రి కి రాత్రే తొలిగిస్తారు అని మరి రైల్వే స్టేషన్ రోడ్ లో విస్తరణ కు అడ్డుగా వున్న కొన్ని భవనాలు జోలికి ఎందుకు పోవడం లేదు అని ప్రశ్నించారు. రోడ్ వెడల్పు విస్తరణ కోసం పలు చిన్న దుకాణాలు తొలగించి ఒకవైపు రోడ్ విస్తరణ చేశారు అని రెండవ వైపు రోడ్ విస్తరణ కు అడ్డుగా ఉన్న ఒక ప్రజా ప్రతినిధి బిల్డింగ్ జోలికి అధికారులు పోవడం లేదు అని ఆరోపించారు. సినిమా హాల్ కు సంబంధించిన భవనంలో వున్న దుకాణాలు అధికారులు తొలగించలేక పోతున్నారు అని ఆరోపించారు. నిత్యం పలు రైళ్లు నుంచి రోజూ వేలాది మంది ప్రయాణికులతో ఈ రోడ్ బాగా రద్దీగా వుంటుంది అని దిని వల్ల తీవ్రమైన ట్రాఫిక్ సమస్యలు ఎదురయ్యే అవకాశాలు రోజూ వుంటున్నాయి అని ఆందోళన వ్యక్తం చేశారు. అధికార పార్టీ ప్రజా ప్రతినిధులు, కార్పొరేషన్ కమిషనర్ ఈ రోడ్ విస్తరణ పై దృష్టి సారించి సమస్య పరిష్కారం చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా కమిటీ సభ్యులు జబ్బర్, మీరా సాహిబ్, దొంగల తిరుపతిరావు, ఎస్ నవీన్ రెడ్డి, భుక్యా శ్రీనువాసురావు నాయకులు నాగులు మీరా, ఉపేంద్ర , బేగం, కూరపాటి శ్రీను, ఇమామ్, యర్రా రంజిత్, జె వెంకన్న బాబు, వెంకటాద్రి, నాగేశ్వరరావు పాల్గొన్నారు

# 26న వురిమళ్ల సునంద ఉద్యోగ విరమణ ఆత్మీయ కలయిక



**ఖమ్మం క్రైమ్ మిర్రర్ బ్యూరో:** ఈ నెల 26న ప్రముఖ రచయిత వురిమళ్ల సునంద ఉద్యోగ విరమణ ఆత్మీయ కలయిక కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు వురిమళ్ల ఫౌండేషన్ వ్యవస్థాపకులు భోగోజు ఉపేందర్‌రావు, అక్షరాల తోవ సాహిత్య సంస్థ నిర్వాహకులు నామా పురుషోత్తం, దాసురోజు శ్రీనివాస్, రాచమళ్ల ఉపేందర్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఖమ్మంలోని బోడేపూడి విజ్ఞాన కేంద్రంలో ఆదివారం ఉదయం 10 గంటలకు ఈ కార్యక్రమం జరుగుతుందని తెలిపారు. ఉపాధ్యాయురాలిగా, పాఠ్య పుస్తక రచయితగా, బాలసాహితీవేత్తగా, రచయితగా వురిమళ్ల సునంద పేరొందారని తెలిపారు. తను పని చేసిన ప్రతి పాఠశాలలో ప్రతిభ చూపిన విద్యార్థులను ప్రోత్సహిస్తూ తన సోదరి జ్ఞాపకార్థం బహుమతులు అందచేసేవారని, బాలకవులను తయారు చేశారని పేర్కొన్నారు. అనేక మార్లు విద్యార్థుల్లో దాగి వున్న సాహిత్య ప్రతిభను వెలికి తీసి వారి రచనలను తన సొంత ఖర్చుతో పుస్తకాలుగా ముద్రించారని తెలిపారు. వురిమళ్ల ఫౌండేషన్‌ను స్థాపించి అటు బాలసాహిత్యాన్ని, ఇటు వర్ధమాన కవులను పోత్సహిస్తూ సాహితీ సేవ చేస్తున్నారని పేర్కొన్నారు. గత 8 సంవత్సరాలుగా వురిమళ్ల పద్మజ, వురిమళ్ల శ్రీరాములు స్మారకార్థం అంతర్జాతీయ స్థాయిలో కవితల, కథల పోటీలు నిర్వహించి నగదు బహుమతులు అందజేయడమే గాకుండా విజేతల రచనలను పుస్తకాలుగా ముద్రించారని తెలిపారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని లబ్ధప్రతిష్టులైన సాహితీ వేత్తలకు భోగోజు సముద్రమ్మ-పురుషోత్తం స్మారక పురస్కారం అందచేస్తూ అందరి మన్ననలు పొందుతున్నారని తెలిపారు. అటు ఉపాధ్యాయురాలిగా, ఇటు సాహితీవేత్తగా వురిమళ్ల సునంద ఎనలేని సేవలు చేసి కీర్తిప్రతిష్టలు పొందారని, ఆమెతో ఉన్న అనుబంధాన్ని నెమరువేసుకునేందుకు ఈ కార్యక్రమానికి సాహితీవేత్తలు, ఉపాధ్యాయులు, సాహిత్యాభిమానులు, కవులు, రచయితలు హాజరై జయప్రదం చేయాలని నిర్వాహకులు కోరారు.

# బీఆర్ఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ జన్మదిన వేడుకలు

### విద్యార్థులకు పుట్ బాల్స్ పంపిణీ



**యాదాద్రి భువనగిరి జిల్లా బ్యూరో, జూలై 24(క్రైమ్ మిర్రర్):** యాదాద్రి భువనగిరి జిల్లా రాజాపేట మండల కేంద్రంలో బీఆర్ఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ జన్మదిన వేడుకలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గాంధీ చౌరస్తా లో కేక్ కట్ చేసి పార్టీ కుటుంబ సభ్యులకు స్వీట్లు పంపిణీ చేశారు పుట్టిన రోజు సందర్భంగా రెండు పాఠశాలల విద్యార్థులకు ఫుట్ బాల్స్ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమం లో మండల పార్టీ అధ్యక్షులు సట్టు తిరుమలేష్, మదర్ డైరీ డైరెక్టర్ సంధిల భాస్కర్ గౌడ్, గ్రామ శాఖ అధ్యక్షుడు బెడిదే వీరేశం మాజీ సర్పంచ్ రాములు నాయక్ రాణి లక్ష్మణ్ గోపి రెడ్డి కనకయ్య కరుణాకర్ రెడ్డి సర్పంచ్ బాలరాజు రెడ్డి సుమన్ మాజీ మార్కెట్ కమిటీ డైరెక్టర్ నాగరాజు గుర్రం నరసింహులు మండల సోషల్ మీడియా అధ్యక్షులు గంధమల్ల సురేష్ సోమలింగం హరినాథ్ కూతురు లింగం యమ్మ భాస్కర్ గజ్జల రాజు కరీం నాగేష్ గౌడ్ అశోక్ గౌడ్ ఉపేందర్ ఎర్ర గోకుల చంద్రయ్య చెప్పాల మైపాల్ నాగపురి కరుణాకర్ దేవుల నాయక్ లక్ష్మణ్ నాయక్ పార్టీ కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ విప్ ను కలిసిన చలమల్ల

**మునుగోడు క్రైమ్ మిర్రర్:** నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం కు క్యాబినెట్ హోదా లభించిన సందర్భంగా చలమల్ల కృష్ణారెడ్డి మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్చం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.. సురిగి నరసింహ గౌడ్ పాల్గొన్నారు.



# జనం మెచ్చిన నేత కేటీఆర్



### మమతలో ఘనంగా జన్మదిన వేడుకలు

### పువ్వాడ ఆధ్వర్యంలో కేక్ కటింగ్. అభిమానుల రక్తదానం

### విజనరీ లీడర్‌కు శుభాకాంక్షల వెల్లువ

**ఖమ్మం క్రైమ్ మిర్రర్ బ్యూరో :** తెలంగాణను ఐటీ పారిశ్రామిక రంగాల్లో ప్రపంచపటంలో నిలిపి నవతరం ఆలోచనలతో రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపించిన విజనరీ లీడర్ బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కల్వకుంట్ల తారక రామారావు (కేటీఆర్) జన్మదిన వేడుకలు ఖమ్మం నగరంలో అత్యంత వైభవంగా జరిగాయి. ఈ సందర్భంగా మాజీ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ ఆధ్వర్యంలో ఖమ్మంలోని మమత హాస్పిటల్ ఆవరణలో ఘనంగా కేక్ కటింగ్ కార్యక్రమం నిర్వహించారు. నాయకులు అభిమానుల నడుమ సంబరాలు అంబరాన్నంటాయి. వేడుకలకే పరిమితం కాకుండా సామాజిక బాధ్యతతో నిర్వహించిన రక్తదాన శిబిరానికి అపూర్వ స్పందన లభించింది. బీఆర్ఎస్ పార్టీ శ్రేణులు యువత పెద్ద సంఖ్యలో పాల్గొని రక్తదానం చేసి తమ నాయకుడిపై ఉన్న అభిమానాన్ని చాటుకున్నారు. ఈ సందర్భంగా డిసిసిబి మాజీ చైర్మన్ కూరాకుల నాగభూషణం మాట్లాడుతూ తెలంగాణను అభివృద్ధి పథంలో పరుగులు తీర్పించిన యువ నాయకుడు కేటీఆర్ ఐటీ, పరిశ్రమల రంగాల్లో రాష్ట్రాన్ని అగ్రగామిగా నిలబెట్టి లక్షలాది మంది యువతకు ఉపాధి అవకాశాలు కల్పించిన ఘనత ఆయనకే దక్కుతుందన్నారు. నవతరం రాజకీయాలకు కేటీఆర్ ఒక దిక్సూచిలా నిలిచారని కొనియాడారు. పట్టుదల భవిష్యత్ ప్రణాళిక ప్రజలకు సేవ చేయాలనే తపన ఉన్న నాయకుడు కేటీఆర్ అన్నారు. ఆయన మరెన్నో ఏళ్లు ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని భవిష్యత్తులో మరిన్ని ఉన్నత పదవులను అధిరోహించి రాష్ట్రాన్ని మరింత పురోగతి వైపు నడిపించాలి అని ఆకాంక్షించారు. ఈ వేడుకల్లో సుడా మాజీ చైర్మన్ బచ్చు విజయ్ కుమార్ బీఆర్ఎస్ నాయకులు ఆర్జెసి కృష్ణ దేవభక్తుని కిషోర్ బాబు గొల్లపూడి రాంప్రసాద్ కూరాకుల వలరాజు నాగండ్ల కోటి పగడాల నాగరాజు బి రెడ్డి నాగచంద్రారెడ్డి బిక్కసాని ప్రశాంత లక్ష్మి షేక్ మక్బుల్ కర్నాటి కృష్ణ షేక్ షకీనా వాంకుడోత్ సురేష్ కందాల వీరేంద్ర ఉస్మాన్ బొడ్డుపల్లి వెంకటేశ్వర్లు వెంకట్ తమ్మి రమేష్ పరిమళ ప్రవీణ్ షేక్ యూసుఫ్ తదితరులు పాల్గొని కార్యక్రమాన్ని విజయం చేశారు.



# ఖుదాబక్షపల్లిలో హెల్త్ సబ్ సెంటర్ భవన నిర్మాణానికి భూమిపూజ.

### గ్రామ ప్రజలకు మెరుగైన వైద్య సేవల దిశగా మరో ముందడుగు

### సర్పంచ్ పందుల జయలక్ష్మి పాండుగౌడ్ ఆధ్వర్యంలో శంకుస్థాపన

**మర్రిగూడ(క్రైమ్ మిర్రర్):** మండలంలోని ఖుదాబక్షపల్లి గ్రామ ప్రజలకు, మరింత మెరుగైన వైద్య సేవలు అందుబాటులోకి తీసుకురావాలనే లక్ష్యంతో, ప్రభుత్వం మంజూరు చేసిన హెల్త్ సబ్ సెంటర్ భవన నిర్మాణ పనులకు, శుక్రవారం ఖుదాబక్షపల్లి గ్రామంలో భూమిపూజ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. గ్రామ సర్పంచ్ పందుల జయలక్ష్మి పాండుగౌడ్ ఆధ్వర్యంలో, జరిగిన ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, అధికారులు, గ్రామ పెద్దలు, మహిళలు, ఆశా కార్యకర్తలు, స్థానికులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. వేద మంత్రోచ్చారణల నడుమ భూమిపూజ నిర్వహించి, నిర్మాణ పనులకు శ్రీకారం చుట్టారు. గ్రామంలో హెల్త్ సబ్ సెంటర్ భవనం నిర్మాణం పూర్తయిన తర్వాత గర్భిణీలు, బాలింతలు, చిన్నారులు, వృద్ధులు, ప్రజలకు ప్రాథమిక ఆరోగ్య సేవలు గ్రామంలోనే మరింత మెరుగ్గా, అందే అవకాశం ఉంటుందని తెలిపారు. చిన్నచిన్న వైద్య అవసరాల కోసం దూర ప్రాంతాలకు వెళ్లాల్సిన ఇబ్బందులు తగ్గుతాయని పేర్కొన్నారు. ఈ సందర్భంగా సర్పంచ్ జయలక్ష్మి పాండుగౌడ్ మాట్లాడుతూ.. గ్రామ ప్రజల ఆరోగ్య సంక్షేమమే గ్రామ పంచాయతీ ప్రధాన లక్ష్యమన్నారు. గ్రామ అభివృద్ధితో పాటు విద్య, ఆరోగ్యం, పారిశుద్ధ్యం, మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యత ఇస్తూ, ప్రభుత్వం సహకారంతో అభివృద్ధి కార్యక్రమాలను అమలు చేస్తున్నామని తెలిపారు. హెల్త్ సబ్ సెంటర్ భవనం నిర్మాణాన్ని నాణ్యతా ప్రమాణాలతో, నిర్ణీత గడువులో పూర్తి చేయాలని సంబంధిత అధికారులను వారు కోరారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ ఎస్కే షబీర్, పీఆర్ ఏఈ హరీష్, పంచాయతీ కార్యదర్శి ప్రసన్నబాబు, వార్డు సభ్యులు రాజు, గణేష్, రమేష్, పౌనిక, శిరీష, రజిత, రమేశ్వరి, ఏఎన్ఎం సునీత, ఆశా కార్యకర్తలు, గ్రామ పెద్దలు, మహిళలు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి నిరంతర పోరాటం

## తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ (టిడబ్ల్యూజేఎఫ్) రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షులు మామిడి సోమయ్య



**కూకట్ పల్లి, జూలై 24 (క్రైమ్ మిర్రర్) :** జర్నలిస్టుల సమస్యలను పరిష్కరించే వరకు నిరంతరం పోరాటం కొనసాగిస్తామని తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ (టిడబ్ల్యూజేఎఫ్) రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షులు మామిడి సోమయ్య అన్నారు. కూకట్ పల్లిలోని ఏ ఎస్ రాజు నగర్ కమ్యూనిటీ హాలులో శుక్రవారం కూకట్ పల్లి నియోజకవర్గం మహాసభ నిర్వహించారు. ఆ సంఘం మేడ్చల్ జిల్లా అధ్యక్షులు కట్టెల మల్లేశం అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి సోమయ్య ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలోని అర్హులైన ప్రతి ఒక్క జర్నలిస్టుకు అక్రిడేషన్ కార్డుతో పాటు హెల్త్ కార్డు ఇతర సంక్షేమ పథకాలు అమలు చేసేందుకు ప్రభుత్వంతో పోరాటం చేస్తామన్నారు. గత ప్రభుత్వం మాదిరిగానే రేవంత్ రెడ్డి ప్రభుత్వం కూడా జర్నలిస్టులను మోసం చేసింది అన్నారు. మూడు నెలలు గడుస్తున్నప్పటికీ జర్నలిస్టులందరికీ అక్రిడిటేషన్ కార్డులు ఇవ్వలేని అసమర్ధ స్థితిలో ప్రభుత్వం ఉందన్నారు. సంఘం ఏర్పాటు నుండి నేటి వరకు నిరంతరం జర్నలిస్టుల సమస్యలపై పోరాడుతున్న ఏకైక సంఘం టిడబ్ల్యూజేఎఫ్ అన్నారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తన్నీరు శ్రీనివాస్ మాట్లాడుతూ ఐక్యమత్యం తోనే అన్ని సాధ్యమవుతాయన్నారు. జర్నలిస్టులను విడదీయడం వల్ల వారి సమస్యల పరిష్కారంలో జాప్యం జరిగే విధంగా ఇతర సంఘాలు కుట్ర చేస్తున్నాయని విమర్శించారు. ప్రభుత్వంతోపాటు వారితో కుమ్మక్కైన జర్నలిస్టు సంఘాల ఎత్తులను చిత్తు చేసే విధంగా భవిష్యత్తులో వ్యూహాత్మక పోరాటం చేయాల్సిన అవసరం ఉందన్నారు. ఐక్యత లోపించడం వల్ల కూకట్ పల్లి నియోజకవర్గంలోని జర్నలిస్టులు ఇప్పటికే చాలా వరకు నష్టపోయారని గుర్తు చేశారు. అనంతరం మేడ్చల్ జిల్లా అధ్యక్షులు కట్టెల మల్లేశం కూకట్ పల్లి నియోజకవర్గ కమిటీని ప్రతిపాదించగా మహాసభ ఏకగ్రీవంగా ఆమోదించింది.

**అధ్యక్షులుగా ఎర్ర యాకయ్య :** అధ్యక్షులుగా ఎర్ర యాకయ్య, ప్రధాన కార్యదర్శిగా నాగుల అంజిబాబు, కోశాధికారిగా షబ్బీర్, ఉపాధ్యక్షులుగా బొమ్మ గోపి, కార్యవర్గ సభ్యులుగా నవీన్, సుజాత, నాగరాజు గౌడ్, శ్యాంసుందర్, సైదులు లను ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ ఉద్యమకారుడు, సీనియర్ జర్నలిస్ట్ విద్యా వెంకట్, టిడబ్ల్యూజేఎఫ్ జాతీయ కౌన్సిల్ సభ్యులు దామెర జగదీశ్వర్, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు నాగరాజు గౌడ్, గ్రేటర్ హైదరాబాద్ కన్వీనర్ రవికుమార్, మేడ్చల్ జిల్లా ప్రధాన కార్యదర్శి గడ్డమీది అశోక్, జిల్లా ఉపాధ్యక్షులు వంగాల కొండల్ రెడ్డి, చైతన్య రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

క్రైమ్ మిర్రర్®
Voice of Anti Corruption
తెలంగాణ జిల్లాలు
శనివారం 25-7-2026


# నీట్ పరీక్షల నిర్వహణలో కేంద్ర ప్రభుత్వం పూర్తిగా విఫలం

## విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ పదవికి వెంటనే రాజీనామా చేయాలి

## ప్రజల హక్కుల కోసం, ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం నిర్వహించిన ర్యాలీలో పాల్గొన్న కాంగ్రెస్ నాయకులు

**కూకట్ పల్లి, జూలై 24 (క్రైమ్ మిర్రర్) :** కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ నిరసనకు మద్దతుగా కాంగ్రెస్ పార్టీ పిలుపునిచ్చిన ర్యాలీలలో శుక్రవారం ఉమ్మడి ఆల్విన్ కాలనీ 124 డివిజన్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించిన ర్యాలీ విజయవంతంగా జరిగింది. శంషిగూడా చౌరస్తా నుంచి గుడ్ విల్ హోటల్ చౌరస్తా" వరకు డివిజన్ లోని కాంగ్రెస్ పార్టీ నాయకులతో కలిసి, యువత భవిష్యత్తు కోసం పోరాడుతున్న రాహుల్ గాంధీ కి మద్దతుగా ర్యాలీ నిర్వహించారు. దేశవ్యాప్తంగా విద్యార్థులపై దాడులు, అరెస్టులకు వ్యతిరేకంగా నిరసనలు, ప్రజల నుండి లభిస్తున్న మద్దతును చూస్తుంటే, ప్రతిపక్ష నాయకులపై జరిగిన అక్రమ అరెస్టులకు కేంద్ర ప్రభుత్వం వెంటనే క్షమాపణ చెప్పాలని వారు డిమాండ్ చేస్తూ నిరసన తెలిపారు. కాంగ్రెస్ నాయకుల అరెస్టు ప్రజాస్వామ్య హక్కులపై దాడి అని, రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీల అరెస్టులు ప్రజాస్వామ్య విరుద్ధమని, నీట్ పరీక్షల నిర్వహణలో పూర్తిగా విఫలమైన కేంద్ర ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తున్న వారిపై అణిచివేతకు పాల్పడుతుందని, నీట్






అక్రమాలకు బాధ్యత వహిస్తూ,(విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్) కారణమని, కావున వారు వెంటనే తమ పదవిని రాజీనామా చేయాలనీ "ఉమ్మడి ఆల్విన్ కాలనీ 124 డివిజన్ కాంగ్రెస్ సీనియర్ నాయకులు" పట్వారీ శశిధర్ డిమాండ్ చేశారు. ర్యాలీల్లో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ, ఈ నిరసన కార్యక్రమంలో తమ మద్దతు తెలియజేశారు. అగ్రనేతల అక్రమ అరెస్టులకు నిరసనగా, కేంద్ర ప్రభుత్వ నియంతృత్వ వైఖరిని ఖండిస్తూ, ఆల్విన్ కాలనీ డివిజన్ లో 'ధర్నా' ర్యాలీలో పాల్గొని కేంద్ర ప్రభుత్వ తీరుపై ప్రజలు భారీ ఎత్తున పాల్గొని శాంతియుతంగా తమ నిరసనను వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి ఆల్విన్ కాలనీ డివిజన్ మాజీ కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్, సీనియర్ నాయకులు, మహిళా నాయకులు, యూత్ కాంగ్రెస్, ఎన్ ఎస్ యు ఐ నాయకులు, కార్యకర్తలు, యువకులు, టీం పట్వారీ తదితరులు భారీ ఎత్తున పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# ఓటరు జాబితాలో పేరు నమోదు కోసం శని, ఆదివారాల్లో ప్రత్యేక శిబిరాలు

## ఎన్యూమరేషన్ ఫారాలను వెంటనే అందించండి.. ఆలస్యం చేస్తే ఇబ్బందులు తప్పవు

## రాజేంద్రనగర్ ఈఆర్ఓ సోలిపేట శ్రీనివాస్ రెడ్డి

**గండిపేట్ : ( క్రైమ్ మిర్రర్ ):** ఓటర్లకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఎన్యూమరేషన్ ఫారాల స్వీకరణ ప్రక్రియను వేగవంతం చేసేందుకు రాజేంద్రనగర్ నియోజకవర్గ పరిధిలో శని, ఆదివారాల్లో ప్రత్యేక శిబిరాలు నిర్వహిస్తున్నట్లు రాజేంద్రనగర్ నియోజకవర్గ ఎలక్ట్రోల్ రిజిస్ట్రేషన్ ఆఫీసర్, జోనల్ కమిషనర్ సోలిపేట శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. రాజేంద్రనగర్ నియోజకవర్గంలో మొత్తం 6,35,283 మంది ఓటర్లు ఉన్నారని, ఇప్పటివరకు 3,26,785 మంది ఓటర్ల నుంచి ఎన్యూమరేషన్ ఫారాలను స్వీకరించి డిజిటలైజ్ చేసినట్లు వెల్లడించారు. దీంతో ఓటరు జాబితా సవరణ ప్రక్రియలో 51.44 శాతం పురోగతి సాధించినట్లు తెలిపారు. ఇంకా 2,78,670 మంది ఓటర్ల ఎన్యూమరేషన్ ఫారాలు అందాల్సి ఉందని, అలాగే 29,828 మంది ఓటర్ల చిరునామాలు గుర్తించాల్సి ఉందని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరు బాధ్యతగా స్పందించి తమ ఎన్యూమరేషన్ ఫారాలను పూర్తి చేసి అందించాలని కోరారు. ఓటర్ల సౌకర్యం కోసం శని, ఆదివారాల్లో నియోజకవర్గంలోని అన్ని బస్తీలు, కాలనీలు, పోలింగ్



బూత్‌లు, కమ్యూనిటీ హాళ్లు, ప్రధాన కూడళ్ల వద్ద ప్రత్యేక శిబిరాలు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఈ శిబిరాల్లో బీఎల్ఓలు, సంబంధిత విభాగాల సిబ్బంది అందుబాటులో ఉండి ఎన్యూమరేషన్ ఫారాలను స్వీకరిస్తారని చెప్పారు. ఈ రెండు రోజులను ఓటర్లు సద్వినియోగం చేసుకుని తమ ఫారాలను పూర్తి చేసి అందించాలని సూచించారు. ఆలస్యం చేస్తే ఓటరు జాబితాలో పేరు నమోదు విషయంలో ఇబ్బందులు ఎదురయ్యే అవకాశం ఉందని హెచ్చరించారు. ఆగస్టు 3వ తేదీలోగా ఎన్యూమరేషన్ ఫారాలను అందించి నట్లయితే ఓటరు జాబితాలో పేరు నమోదు ప్రక్రియ సులభంగా జరుగుతుందని సోలిపేట శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. గడువు తర్వాత ఓటరు జాబితాలో పేరు నమోదు చేసుకోవాలంటే చిరునామా ధృవీకరణ పత్రం, వయస్సు ధృవీకరణ పత్రాలు వంటి ఆధారాలను సమర్పించాల్సి ఉంటుందని వివరించారు. ప్రతి అర్హత కలిగిన పౌరుడు ఓటు హక్కును కాపాడుకునేందుకు వెంటనే ఎన్యూమరేషన్ ఫారం తీసుకుని పూర్తి చేసి అందించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

# కిమ్స్ హాస్పిటల్స్ అధినేత డా. బొల్లినేని భాస్కర్ రావుకు ఘన సన్మానం



**గండిపేట(క్రైమ్ మిర్రర్):** కిమ్స్ హాస్పిటల్స్ అధినేత డా. బొల్లినేని భాస్కర్ రావును నార్సింగి వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్ లక్ష్మీశ్రీతో పాటు ఆర్టిస్ట్స్ అసోసియేషన్ ఆఫ్ తెలుగు టెలివిజన్ (ఎఏటిటి) కార్యవర్గ సభ్యులు మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించారు. ఈ సందర్భంగా గత 21 సంవత్సరాలుగా తెలుగు టెలివిజన్ కళాకారులకు ఆరోగ్య బీమా సదుపాయం అందిస్తూ వారి సంక్షేమానికి విశేషంగా కృషి చేస్తున్నందుకు డా. భాస్కర్ రావుకు కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం ఎఏటిటి ప్రతినిధులు శాలువాతో సత్కరించి తమ అభినందనలు తెలియజేశారు. కళాకారుల సంక్షేమానికి కిమ్స్ హాస్పిటల్స్ అందిస్తున్న సేవలు ఆదర్శప్రాయమని, భవిష్యత్తులో కూడా ఇదే విధంగా సహకారం కొనసాగాలని ఈ సందర్భంగా ఎఏటిటి ప్రతినిధులు ఆకాంక్షించారు.

# ఎమ్మెల్యే ప్రకాశ్ గౌడ్ సహకారంతో సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కు పంపిణీ

**గండిపేట(క్రైమ్ మిర్రర్):** రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాశ్ గౌడ్ సహకారంతో కిస్మత్‌పూర్ 122వ డివిజన్ కృష్ణనగర్ కాలనీకి చెందిన శ్రీధర్‌కు రూ.25 వేల ముఖ్యమంత్రి సహాయ నిధి (సీఎం రిలీఫ్ ఫండ్) చెక్కును గోకరి సురేష్ గౌడ్ అందజేశారు. ఈ సందర్భంగా గోకరి సురేష్ గౌడ్ మాట్లాడుతూ ఆపదలో ఉన్న పేద, మధ్యతరగతి కుటుంబాలకు సీఎం రిలీఫ్ ఫండ్ ఎంతో అండగా నిలుస్తోందన్నారు. ప్రజలకు అవసరమైన ప్రభుత్వ సంక్షేమ పథకాలను అర్హులైన ప్రతి ఒక్కరికీ అందేలా ఎమ్మెల్యే ప్రకాశ్ గౌడ్ కృషి చేస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు, కాలనీ వాసులు పాల్గొని తెలిపారు.



# శంషాబాద్ ఎయిర్‌పోర్ట్‌లో నకిలీ టికెట్ల కలకలం

## ఇద్దరు నేపాల్ జాతీయుల అరెస్ట్




గండిపేట(క్రైమ్ మిర్రర్): శంషాబాద్‌లోని రాజీవ్ గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయంలో నకిలీ విమాన టికెట్ల వ్యవహారం కలకలం రేపింది. దుబాయ్ వెళ్లేందుకు ఎయిర్‌పోర్ట్‌కు వచ్చిన ఇద్దరు నేపాల్ జాతీయులను సీఐఎస్ఎఫ్ అధికారులు తనిఖీ చేయగా, వారి వద్ద ఉన్న విమాన టికెట్లు నకిలీవని గుర్తించారు. అనుమానం రావడంతో టికెట్లను సంబంధిత ఎయిర్‌లైన్ రికార్డులతో పరిశీలించిన అధికారులు అవి చెల్లని టికెట్లని నిర్ధారించారు. వెంటనే ఇద్దరినీ అదుపులోకి తీసుకుని ఎయిర్‌పోర్ట్ పోలీసులకు అప్పగించారు. పోలీసులు కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు. నకిలీ టికెట్లను వారికి ఎవరు అందించారు? ఈ వ్యవహారం వెనుక అంతర్జాతీయ మోసగాళ్ల ముఠా లేదా ట్రావెల్ ఏజెన్సీల ప్రమేయం ఉందా? అనే కోణాల్లో దర్యాప్తు కొనసాగిస్తున్నారు. విమానాశ్రయంలోని సీసీటీవీ ఫుటేజీని పరిశీలిస్తున్న అధికారులు, నిందితుల మొబైల్ ఫోన్లు, ప్రయాణ పత్రాలు, ఆన్‌లైన్ బుకింగ్ వివరాలను స్వాధీనం చేసుకుని విశ్లేషిస్తున్నారు. ఈ ఘటనలో మరికొందరి ప్రమేయం ఉన్నట్లు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. దర్యాప్తు పూర్తయిన తర్వాత నిందితులను కోర్టులో హాజరుపరచనున్నట్లు పోలీసులు తెలిపారు. ఈ ఘటనతో అంతర్జాతీయ ప్రయాణాల్లో నకిలీ టికెట్ల మోసాలపై మరోసారి అప్రమత్తంగా ఉండాలని అధికారులు ప్రయాణికులకు సూచిస్తున్నారు.



# హ్యాండ్లూమ్ ఏడినీ కలిసిన మునుగోడు చేనేత సహకార సంఘం సంఘం పాలకవర్గం

మునుగోడు క్రైమ్ మిర్రర్ : మునుగోడులో ఇటీవల జరిగిన చేనేత సహకార సంఘం ఎలక్షన్ లో నూతనంగా ఎన్నికైన మునుగోడు చేనేత సహకార సంఘం పాలకవర్గం శుక్రవారం అధ్యక్షుడు అవ్వారి భాస్కర్ ఆధ్వర్యంలో చేనేత శాఖ ఏడి గోవిందయ్యను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఏడి గోవిందయ్య మాట్లాడుతూ నిరంతరం కార్మికులు అందుబాటులో ఉంటూ వారి అవసరాలు తీర్చాలని తదానుగుణంగా మీ దృష్టికి వచ్చినా మరియు ఎదురయ్యే సమస్యల తన దృష్టికి తీసుకువస్తే పరిష్కరిస్తానని తెలిపారు.మునుగోడు చేనేత సహకార సంఘం ఉపాధ్యక్షులు మిరియాల సుభద్ర, కార్యదర్శి రావిరాల కుమార్,కోశాధికారి గంజి నరేందర్,డైరెక్టర్లు కర్నాటి రాజు, బొల్ల చంద్రకళ,చెరిపెల్లి యాదగిరి,మిరియాల మధుకర్ , చిలుకూరి మధు,మాజీ అధ్యక్షులు సంగిశెట్టి పరమేష్, మాజీ కుల సంఘం అధ్యక్షులు గంజి బిక్షం తదితరులు పాల్గొన్నారు.

# షాపూర్ పోలీస్ స్టేషన్ సీఐ నరేందర్ రెడ్డికి ఘన వీడ్కోలు



**గండిపేట(క్రైమ్ మిర్రర్):** షాపూర్ పోలీస్ స్టేషన్ సీఐ నరేందర్ రెడ్డి చేవెళ్ల పోలీస్ స్టేషన్‌కు బదిలీ కావడంతో పోలీస్ స్టేషన్‌లో భావోద్వేగ వాతావరణం నెలకొంది. ఈ సందర్భంగా పోలీస్ స్టేషన్ సిబ్బంది, ఎస్సైలు, సీఐలు, కానిస్టేబుళ్లు భారీ సంఖ్యలో పాల్గొని ఆయనకు ఘనంగా వీడ్కోలు పలికారు. సీఐ నరేందర్ రెడ్డిని పూలమాలలు, గులాబీ పూలతో సన్మానించి, శాలువాతో సత్కరించారు. ఆయన సేవలను కొనియాడుతూ సహచర అధికారులు శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా స్పందించిన సీఐ నరేందర్ రెడ్డి, తనతో కలిసి పనిచేసిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలుపుతూ, చేవెళ్ల పోలీస్ స్టేషన్‌లో కూడా ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందిస్తానని తెలిపారు. అనంతరం సహచరుల శుభాకాంక్షల నడుమ సీఐ నరేందర్ రెడ్డి శంషాబాద్ నుంచి చేవెళ్ల పోలీస్ స్టేషన్‌కు బయలుదేరారు.

# షాదాన్ హాస్పిటల్--కాళీ మందిర్ మధ్య ప్రతిపాదిత యు-టర్న్‌పై సంయుక్త తనిఖీ

## ట్రాఫిక్ భద్రత, ప్రజల సౌకర్యమే లక్ష్యం.. నిబంధనల మేరకు చర్యలు- అధికారులు

గండిపేట(క్రైమ్ మిర్రర్): షాదాన్ హాస్పిటల్ నుంచి కాళీ మందిర్ వరకు కొనసాగుతున్న మీడియన్ నిర్మాణ పనుల నేపథ్యంలో, స్థానిక ప్రజల విజ్ఞప్తి మేరకు ప్రతిపాదిత యు-టర్న్ ఏర్పాటుపై ట్రాఫిక్ పోలీసులు, జీహెచ్ఎంసీ అధికారులు సంయుక్తంగా క్షేత్రస్థాయి తనిఖీ నిర్వహించారు. ట్రాఫిక్ రద్దీకి అంతరాయం కలగకుండా, ప్రజలకు సురక్షితమైన రాకపోకలు కల్పించే ఉద్దేశంతో ఈ పరిశీలన చేపట్టారు. ఈ తనిఖీలో






వార్డులు 121, 122, 123లకు చెందిన ఆల్ కాలనీస్ ఫెడరేషన్ అధ్యక్షుడు వినయ్ రెడ్డి, ఉపాధ్యక్షుడు నదీమ్, ప్రధాన కార్యదర్శి నరేందర్ బాబు, కార్యవర్గ సభ్యుడు విజయ్ పద్మనాభన్, నర్సింగి ట్రాఫిక్ పోలీస్ అధికారులు, జీహెచ్ఎంసీ అసిస్టెంట్ ఇంజినీర్ నాగి రెడ్డి పాల్గొన్నారు. పరిశీలన సందర్భంగా ఇండియన్ రోడ్స్ కాంగ్రెస్ మార్గదర్శకాలు, ట్రాఫిక్ భద్రతా ప్రమాణాలు, రహదారి వెడల్పు, వాహనాల రద్దీ తదితర అంశాలను అధికారులు సమగ్రంగా పరిశీలించారు. ట్రాఫిక్‌కు ఆటంకం కలగకుండా, ప్రజలకు సురక్షితంగా ఉండే ప్రదేశంలోనే యు-టర్న్ ఏర్పాటు చేయాలని నిర్ణయించినట్లు తెలిపారు. ఈ ప్రతిపాదనను సీనియర్ అధికారులకు పంపించి, అవసరమైన అనుమతులు పొందిన అనంతరం నిబంధనలకు అనుగుణంగా యు-టర్న్ ఏర్పాటు చేస్తామని ట్రాఫిక్ పోలీసులు హామీ ఇచ్చారు. అలాగే, సీనియర్ అధికారుల ఆమోదం లభించిన ప్రదేశంలో మాత్రమే మీడియన్ ఓపెనింగ్ ఏర్పాటు చేస్తామని జీహెచ్ఎంసీ అధికారులు స్పష్టం చేశారు. స్థానిక ప్రజల భద్రత, ట్రాఫిక్ సౌలభ్యం, ప్రమాదాల నివారణను దృష్టిలో ఉంచుకుని ఈ చర్యలు చేపడుతున్నామని అధికారులు తెలిపారు. ఈ నిర్ణయాన్ని స్థానిక ప్రజలు, ఆల్ కాలనీస్ ఫెడరేషన్ ప్రతినిధులు స్వాగతిస్తూ, త్వరితగతిన అమలు చేయాలని కోరారు.

# పేదరికానికి అడ్డుకట్ట.. హర్షిని ఉన్నత చదువులకు ఎమ్మెల్యే జీఎంఆర్ చేయూత

## బాసర ట్రిపుల్ ఐటీలో చేరనున్న విద్యార్థినికి రూ.1.50 లక్షల ఆర్థిక సహాయం



పటాన్‌చెరు, క్రైమ్ మిర్రర్ ప్రతినిధి జూలై 24: పేదరికం ప్రతిభకు అడ్డంకి కాకూడదనే లక్ష్యంతో పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి మరోసారి తన సేవాభావాన్ని చాటుకున్నారు. ఉన్నత విద్యను కొనసాగించేందుకు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న ఓ నిరుపేద విద్యార్థినికి రూ.1.50 లక్షల ఆర్థిక సహాయాన్ని అందించి ఆమె భవిష్యత్తుకు అండగా నిలిచారు.తెల్లాపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి పూర్తి చేసిన విద్యార్థిని హర్షిని 574 మార్కులతో ప్రతిష్ఠాత్మకమైన బాసర ట్రిపుల్ ఐటీలో సీటు సాధించింది. అయితే కుటుంబ ఆర్థిక పరిస్థితుల కారణంగా విద్యాభ్యాసాన్ని కొనసాగించడం కష్టంగా మారింది. ఈ విషయాన్ని స్థానికులు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లగా, వెంటనే స్పందించిన ఆయన విద్యార్థిని, ఆమె కుటుంబ సభ్యులను పిలిపించి ధైర్యం చెప్పారు. అనంతరం బాసర ట్రిపుల్ ఐటీలో ఆరు సంవత్సరాల విద్యాభ్యాసానికి అవసరమైన ఫీజుల కోసం రూ.1.50 లక్షల ఆర్థిక సహాయాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి మాట్లాడుతూ.. ప్రతిభావంతులైన విద్యార్థులు ఆర్థిక ఇబ్బందుల వల్ల చదువుకు దూరం కాకూడదనే ఉద్దేశంతో ఈ సహాయం అందించినట్లు తెలిపారు. విద్యార్థిని హర్షిని ఉన్నత విద్యను విజయవంతంగా పూర్తి చేసి జీవితంలో ఉన్నత స్థానానికి చేరుకోవాలని ఆకాంక్షించారు. భవిష్యత్తులో కూడా అవసరమైన సహకారం అందిస్తానని హామీ ఇచ్చారు. ఎమ్మెల్యే అందించిన ఆర్థిక సహాయానికి విద్యార్థిని హర్షిని, ఆమె కుటుంబ సభ్యులు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు.

# జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్‌గా గిలక రాజు ఎన్నిక

## ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి పానుగంటి పర్వతాలకు కృతజ్ఞతలు తెలిపిన గిలక రాజు



గండిపేట(క్రైమ్ మిర్రర్): రాజేంద్రనగర్ దేవరాజ్ భవన్‌లో గురువారం నిర్వహించిన రంగారెడ్డి జిల్లా భవన నిర్మాణ కార్మిక సంఘం నాలుగో మహాసభలో గిలక రాజును జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్‌గా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా గిలక రాజు మాట్లాడుతూ తనపై నమ్మకం ఉంచి జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్‌గా ఎన్నుకున్న ఏఐటీయూసీ రంగారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శి పానుగంటి పర్వతాలుతో పాటు జిల్లా నాయకత్వానికి హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు.తనపై ఉంచిన విశ్వాసాన్ని నిలబెట్టుకుంటూ కార్మికుల సంక్షేమం కోసం నిరంతరం కృషి చేస్తానని, సంఘం బలోపేతానికి శక్తివంచన లేకుండా పనిచేస్తానని పేర్కొన్నారు. అలాగే పార్టీ, సంఘం పట్ల విధేయుడిగా ఉంటూ అప్పగించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహిస్తానని హామీ ఇచ్చారు. మహాసభలో పాల్గొన్న నాయకులు గిలక రాజుకు శుభాకాంక్షలు తెలియజేసి, ఆయన సేవలు సంఘ అభివృద్ధికి దోహదపడాలని ఆకాంక్షించారు.



# కేటీఆర్ జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించిన బీఆర్ఎస్ శ్రేణులు

గండిపేట(క్రైమ్ మిర్రర్): మణికొండ, నెక్నంపూర్ ప్రాంతాల భారత రాష్ట్ర సమితి (బీఆర్ఎస్) పార్టీ ఆధ్వర్యంలో పార్టీ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారక రామారావు (కేటీఆర్) జన్మదిన వేడుకలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మణికొండ పైప్‌లైన్ రోడ్డులోని రేణుక ఎల్లమ్మ దేవాలయంలో కేటీఆర్ ఆయురారోగ్యాలతో, ప్రజా సేవలో మరింత ముందుకు సాగాలని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం కేక్ కట్ చేసి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమంలో భాగంగా భక్తులకు, స్థానికులకు అన్నప్రసాదం పంపిణీ చేశారు. ఈ వేడుకల్లో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని కేటీఆర్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

# చేవెళ్ల పార్లమెంట్ సమస్యలపై కేంద్ర రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్‌ను కలిసిన ఎంపీ కొండా విశ్వేశ్వర్ రెడ్డి



గండిపేట(క్రైమ్ మిర్రర్): చేవెళ్ల పార్లమెంట్ నియోజకవర్గానికి సంబంధించిన రెండు కీలక సమస్యలను చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్ రెడ్డి కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్‌ను కలిసి ఆయన దృష్టికి తీసుకెళ్లారు. ఈ సందర్భంగా కె.వి. రంగారెడ్డి జిల్లా బాలాపూర్ మండలం రోషన్‌దౌలా గ్రామంలోని భూ యజమానులకు చెల్లించాల్సిన పరిహారం అంశాన్ని మంత్రి ముందు ప్రస్తావించారు. అలాగే నెక్నాంపూర్‌లోని నివాస కాలనీలకు రాకపోకలు సులభతరం అయ్యేలా రక్షణ శాఖ భూమి మీదుగా 450 మీటర్ల రహదారి నిర్మాణానికి అనుమతి మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ రెండు అంశాలపై కేంద్ర రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ సానుకూలంగా స్పందించి, సంబంధిత అధికారులతో చర్చించి తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు ఎంపీ కొండా విశ్వేశ్వర్ రెడ్డి తెలిపారు. ఈ పరిణామంతో స్థానిక ప్రజల్లో సమస్యల పరిష్కారంపై ఆశాభావం వ్యక్తమవుతోంది.

# కేటీఆర్ జన్మదినం సందర్భంగా బుద్వేల్ ప్రభుత్వ ఆస్పత్రిలో పండ్ల పంపిణీ



గండిపేట(క్రైమ్ మిర్రర్): భారత రాష్ట్ర సమితి వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కల్వకుంట్ల తారక రామారావు 50వ జన్మదినాన్ని పురస్కరించుకుని రాజేంద్రనగర్ నియోజకవర్గ నాయకులు పోరెడ్డి ధర్మారెడ్డి, ఎర్రోళ్ల యాదయ్య ఆధ్వర్యంలో బుద్వేల్ ప్రభుత్వ ఆస్పత్రిలో రోగులకు పండ్ల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర సాధన నుంచి రాష్ట్ర అభివృద్ధి వరకు కేటీఆర్ కీలక పాత్ర పోషించారని పేర్కొన్నారు. ప్రజా సమస్యల పరిష్కారం కోసం నిరంతరం శ్రమిస్తూ, యువతకు స్ఫూర్తిగా, రైతులు, మహిళలు, విద్యార్థులకు అండగా నిలుస్తున్న నాయకుడిగా కేటీఆర్ సేవలను కొనియాడారు. అనంతరం కేటీఆర్‌కు 50వ జన్మదిన శుభాకాంక్షలు తెలియజేస్తూ, ఆయురారోగ్యాలతో దీర్ఘకాలం ప్రజాసేవ చేసేలా భగవంతుడు ఆశీర్వదించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో సరికొండ దుర్గేష్, వీర్లపల్లి నవీన్ కుమార్, బండ్ల నరేందర్, గిరిబాబు, ప్రవీణ్, నాగేష్, యాదగిరి, రాజు, వెంకటేష్ గౌడ్, నిష్కల్ రెడ్డి, విజయ్, హనుమాన్ జీ, అకిరా నందన్, సునీల్ గౌడ్, ఎల్లయ్య, రాజిరెడ్డి, నీరజ్, సతీష్, అనుదీప్ రెడ్డి, నవదీప్, రవికిరణ్, బాలు, ప్రదీప్, ప్రవీణ్ రాజ్, శివ తదితర నాయకులు పాల్గొన్నారు.

# ఖమ్మం జిల్లా త్రాగునీటి అవసరాలకు గోదావరి జలాలు... రాష్ట్ర డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు

## ఏన్కూరు కెనాల్ వద్ద నీటి ప్రవాహాన్ని పరిశీలించిన డిప్యూటీ సీఎం



ఖమ్మం క్రైమ్ మిర్రర్ బ్యూరో: రాష్ట్రంలో నెలకొన్న 'ఎల్ నినో' తీవ్ర వాతావరణ పరిస్థితుల వల్ల ఖమ్మం జిల్లా ప్రజలు తాగునీటి ఎద్దడి ఎదుర్కొకుండా ప్రజా ప్రభుత్వం కీలక చర్యలు చేపట్టిందని రాష్ట్ర డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు తెలిపారు. భద్రాచలం వద్ద సీతారామ ప్రాజెక్టు నుంచి గోదావరి జలాలను తాగునీటి అవసరాల కోసం ఖమ్మం జిల్లాకు అందిస్తోందని ఆయన అన్నారు. రెండు రోజులుగా నీటిని తరలిస్తున్న గోదావరి జలాలను డిప్యూటీ సీఎం భట్టి శుక్రవారం సాయంత్రం ఏన్కూర్ నాగార్జునసాగర్ ప్రాజెక్టు ఎడమ కాలువ రెడ్డిగూడెం వద్ద నీటి ప్రవాహాన్ని పరిశీలించారు. ఎల్ నినో ప్రభావం ఎంత ఉన్నప్పటికీ, జిల్లాలో ఏ ఒక్క గ్రామంలోనూ తాగునీటి సమస్య తలెత్తకుండా నిరంతరం పర్యవేక్షించాలని అధికారులకు ఉపముఖ్యమంత్రి దిశా నిర్దేశం దిశానిర్దేశం చేశారు. ఏన్కూర్ రెగ్యులేటర్ వద్ద నాగార్జునసాగర్ (చీరా) కాలువలోకి సీతారామ ఎత్తిపోతల పథకం నీటి పంపిణీ ప్రక్రియ వేగవంతంగా సాగుతోంది. సీతారామ ప్రాజెక్టు నుంచి సుమారు 1,500 క్యూసెక్కుల గోదావరి నీటిని ఏన్కూర్ రెగ్యులేటర్ వద్దకు తీసుకువచ్చి, అక్కడి నుంచి ఎన్ఎస్పీ కాలువ ద్వారా పలు చెరువులకు, ప్రాజెక్టులకు నీటిని తరలింపు జరుగుతోంది. ఏన్కూర్ రెగ్యులేటర్ నుంచి ఎన్ఎస్పీ కాలువ ద్వారా దిగువ వైపునకు 1,000 క్యూసెక్కుల నీరు ప్రవహిస్తోంది. ఈ నీరు సుమారు 100 కిలోమీటర్ల దూరంలో ఉన్న లంకా సాగర్ ప్రాజెక్టు వరకు వెళుతుంది. రెగ్యులేటర్ నుంచి ఎన్ఎస్పీ కాలువ ద్వారా పైభాగంలో ఉన్న ప్రాంతాలకు 500 క్యూసెక్కుల నీటిని మళ్లిస్తున్నారు. ఇందులో 250 క్యూసెక్కుల నీటిని వైరా రిజర్వాయర్‌కు మళ్లించడం జరుగుతోంది. మిగిలిన 250 క్యూసెక్కుల నీటిని పరిధిలోని చెరువులకు విడుదల చేస్తున్నారు. ఈ కార్యక్రమంలో వైరా ఎమ్మెల్యే మాలోతు రాందాస్ నాయక్, రాష్ట్ర హస్త కళల అభివృద్ధి సంస్థ చైర్మన్ నాయుడు సత్యనారాయణ, సుడా చైర్మన్ పువ్వాల దుర్గాప్రసాద్, అధికారులు, ప్రజాప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

# ఆషాఢ మాసంలో భక్తి శోభ -- కాటేదాన్‌లో శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి ఆలయంలో గోరింటాకు వేడుకలు



గండిపేట్ : ( క్రైమ్ మిర్రర్ ): ఆషాఢ మాసం సందర్భంగా కాటేదాన్‌లోని శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి దేవాలయంలో అమ్మవారికి గోరింటాకు (మెహిందీ) కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పెద్ద సంఖ్యలో మహిళలు లేత ఆకుపచ్చ చీరలు ధరించి, చేతులకు గోరింటాకు అలంకరించుకుని అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయంలో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొనగా, మహిళలు భక్తి పారవశ్యంతో పూజల్లో పాల్గొని అమ్మవారి ఆశీస్సులు పొందారు. సంప్రదాయాన్ని, సంస్కృతిని ప్రతిబింబించే ఈ వేడుక భక్తులను విశేషంగా ఆకట్టుకుంది. సంప్రదాయాలను కాపాడుకుంటూ భక్తితో నిర్వహించే ప్రతి కార్యక్రమం సమాజంలో ఐక్యతను, ఆధ్యాత్మిక చైతన్యాన్ని పెంపొందిస్తుంది అని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. ఈ కార్యక్రమంలో దేవాలయ చైర్మన్ సోమ శ్రీనివాస్ గుప్తా, మాజీ చైర్మన్ అర్థం లక్ష్మయ్య గుప్తా, ప్రధాన కార్యదర్శి వీరబొమ్మ సురేష్ గుప్తా, కోశాధికారి కొండా కృష్ణయ్య గుప్తా, వర్కింగ్ ప్రెసిడెంట్ అర్థం శ్రీనివాసులు గుప్తా, అదనపు కార్యదర్శి గుడిపల్లి శేఖర్ గుప్తా , అలాగే బొగ్గారపు భారతమ్మ, సోమ నీరజ, అర్థం సంధ్యారాణి, బలుసా మౌనిక రాణి , మహిళలు పాల్గొన్నారు.

# బిజెపి జిల్లా కార్యవర్గ సభ్యులుగా పల్లె వెంకన్న



చిట్యాల క్రైమ్ మిర్రర్: నకిరేకల్ నియోజకవర్గం నుండి బిజెపి చిట్యాల కు చెందిన బిజెపి సీనియర్ నాయకులు పల్లె వెంకన్న ని బిజెపి జిల్లా కార్యవర్గ సభ్యులుగా నియమించారు ఈ సందర్భంగా వెంకన్న మాట్లాడుతూ బిజెపి పార్టీకి ఎప్పటికీ రుణపడి ఉంటానని బిజెపి తరపున ప్రజాసేవ చేస్తానని ఆయన అన్నాడు




GHMC hmda Growing Global TS-bPASS

MAKAM GANGADHAR NETHA
President (GHMC)
Telangana Building Planners Association
E-mail ID : sriswamiplanners@gmail.com

SRI SWAMI ASSOCIATES
ARCHITECTS•ENGINEERS•SURVEYORS
We Undertake Building Plans, Lay-Out Plans & Permissions, LRS, BRS, Tax Assesments
GHMC, HMDA, DTCP, TS-bpass, Layout, Building Permissions

వాస్తుకి బిల్డింగ్ ప్లానింగ్, నక్ష చేయబడును
డిజిటల్ లాండ్స్ సర్వే, లే-అవుట్లు,
నక్ష ప్లానింగ్ చేయబడును,
Auto DCR Online Up Loading, Pre DCR Cad Drawing
భవన నిర్మాణం దరఖాస్తు కొరకు సంప్రదించండి.

H.No. 11-5-565, Bhagya Laxmi Towers,
Opp: GHMC Circle Office,
Saroornagar, Hyderabad - 500035
Mob : 9393929595



Printed, Published and Edited by Makam Gangadhar, H.No. 11-13-1100, Dwarakanagar Colony, Saroornagar, Ranga Reddy Dist. 500 035. T.S. Owned by Makam Gangadhar and Printed at MGR Publications, H.No. 11-13-1100, Dwarakanagar Colony, Saroornagar, Ranga Reddy Dist. 500 035. T.S. Editor & Managing Director: Makam Gangadhar +919393446188, RNI No. APTEL/2012/45151.